జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020
# ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi
సంపుటి :03 సంచిక :139 పేజీలు 8 వెల : 5 ఫిబ్రవరి 04 మంగళవారం 2025

జాతీయ దినపత్రిక
ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
వాస్తవాల్లే వార్తలుగా వ్రాసే సత్తా ఉన్న దినపత్రిక




వార్షికోత్సవ
ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...
9వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉదయం దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.
వాస్తవాలే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.
పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....
మీ... ఉదయం దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...
గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉదయం తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

# రైల్వే కేటాయింపుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు పెద్దపీట



**తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు**
**కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం**
**త్వరలో దేశమంతా దాదాపు 100 నమో భారత్ ఎక్స్‌ప్రెస్‌లు**
**రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని వివరించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, కొన్ని పనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. సోమవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.
'ఇటీవల స్విట్జర్లాండ్ వెళ్లి అక్కడి రైల్వే ట్రాక్‌లను పరిశీలించాం. రైల్వే ట్రాక్‌ల నిర్వహణలో స్విట్జర్లాండ్ వ్యవస్థను పాటిస్తున్నాం. వందే భారత్ ట్రైన్లలో స్లీపింగ్ సీట్లపై ట్రయల్ జరుగుతోంది. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్ ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణలో 1,326 కి.మీ మేర ప్రస్తుతం కవచ్ టెక్నాలజీ ఉందని అన్నారు. మరో 1,026 కి.మీ.మేర ఈ టెక్నాలజీ ఏర్పాటు చేస్తున్నాం. 2026లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తాం. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తాం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. పేద వర్గాల కోసం నమో భారత్ రైళ్లను నడుపుతున్నాం. త్వరలో దేశమంతా దాదాపు 100 నమో భారత్ ఎక్స్‌ప్రెస్‌లు తీసుకురానున్నాం. ఈ రైళ్ల ద్వారా పేద ప్రజలు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు' అని కేంద్ర మంత్రి తెలిపారు. ఏపీలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.9,417 కోట్లు కేటాయించామని కేంద్ర మంత్రి తెలిపారు. యూపీఏ హయాంతో పోల్చితే ఈ కేటాయింపులు 11 రెట్లు ఎక్కువన్నారు. రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్ల రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నామని.. ఈ స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు కేటాయించామన్నారు. ఏపీకి మరిన్ని నమో భారత్, వందేభారత్ రైళ్లు కేటాయించామన్నారు. రైళ్ల వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికత సాయంతో రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో ఇప్పటికే అనేక రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని..
అందుకే ఏపీ రైల్వే ప్రాజెక్టుల గురించి బ్జడెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.



## కెసిఆర్‌కు లీగల్ నోటీసులు

2వ



## బిజెపి అక్రమాలను అడ్డుకునే చర్యలు

స్పై కెమరాలు పంచామన్న కేజ్రీవాల్

2వ



## ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి తెర

5న ఎన్నికలకు భారీగా ఏర్పాట్లు

2వ



## కుంభమేళా తొక్కిసలాట దుర్ఘటన దురదృష్టకరం

2వ

# చంద్రబాబుతో నటుడు సోనూసూద్ భేటీ

**ట్రస్ట్ తరపున నాలుగు అంబులెన్సుల అప్పగింత**
**సూద్‌ను అబినందించిన సిఎం చంద్రబాబు**




**అమరావతి:** సీఎం చంద్రబాబును నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. ఏపీ ప్రభుత్వానికి సోనూసూద్ ఫౌండేషన్ నాలుగు అంబులెన్స్‌లను అందించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన సోనూసూద్.. ఫౌండేషన్ అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం నాలుగు అంబులెన్స్‌లను సీఎం ప్రారంభించారు. మర్యాద పూర్వకంగా తనను కలవడానికి వచ్చిన సోనూసూద్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు. ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాహనాలు అందించినందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కరోనా సమయంలో ఆయన చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం సోనూసూద్ మీడియాలో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ ఫెసిలిటీ అభివృద్ధి చేయడంలో మా వంతు కృషి చేస్తున్నా. చాలా మంది అంబులెన్స్‌లు కావాలని అడిగారు. అందుకే ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ కోసం వాటిని అందిస్తున్నా. ఏపీ ప్రజలు నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.

# ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యత పెంచండి

**గత పాలకుల కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యం**
**యాజమాన్యాలకు మంత్రి లోకేశ్ సూచన**



**అమరావతి**:రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యత పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని మంత్రి లోకేశ్ సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యమైనందున... ప్రాథమిక స్థాయి నుంచే పరివర్తనకు కృషి చేస్తున్నామన్నారు. గత పదేళ్లుగా సంస్కరణలు లేని ఇంటర్ విద్యలో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్ని విద్యాసంస్థల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెరగాల్సి ఉందన్నారు. విద్యావ్యవస్థలో నైతిక విలువలతో కూడిన సంస్కరణలు తేవాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీఎఫ్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి తొలి విడతలో రూ.788 కోట్లకు గాను, ఇప్పటికే రూ.571.96 కోట్లు విడుదల చేశామని.. రెండు, మూడు రోజుల్లో మిగిలిన రూ.216.04 కోట్లు కూడా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని.. చర్చలు, సంప్రదింపుల ద్వారానే విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ (ఔజీసజీ ఒనీ౹బఠ) స్పష్టం చేశారు. సంస్కరణలు అమలు చేసే క్రమంలో ఏవైనా తప్పులు దొర్లితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉండవల్లిలోని నివాసంలో ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేశ్‌తో సమావేశమయ్యారు. కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పర్చూరి అశోక్ బాబు, వేపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్లేస్‌మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి తెలపాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించి ఇంజినీరింగ్ విద్య నాణ్యత పెంచేందుకు అందరి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు.

# బిజెపి జిల్లాల అధ్యక్షుల నియామకం

**ఏడుగురు రెడ్డీలకు చాన్స్**
**15 మంది బీసీలకు అవకాశం**
**వైశ్యులు ఇద్దరు, కమ్మ ఒకరు**
**ఎస్సీలు ఇద్దరు, ఎస్టీలు నిల్**
**ఒకే ఒక్క మహిళకు దక్కిన చాన్స్**




హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా 27 జిల్లాల అధ్యక్షుల ఎంపిక పూర్తయింది. మిగతా ఆరు జిల్లాల అధ్యక్షుల ఎన్నిక త్వరలోనే జరగనుంది. ఈ జిల్లాల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో పెండింగ్ లో పెట్టినట్టు సమాచారం.
27 జిల్లాలకు గాను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారు. అలాగే వైశ్యులు ఇద్దరు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఒకరు ఉన్నారు. మొత్తంగా 10 మంది ఓసీలకు జిల్లా అధ్యక్ష పదవులు దక్కాయి. 15 మంది బీసీలకు ఈ సారి అవకాశం లభించింది. వీరిలో మున్నూరు కాపులు ఆరుగురు, గౌడ కులస్తులు నలుగురు, ఇతర బీసీలు ఐదుగురు ఉన్నారు. ఇద్దరు ఎస్సీలకు బీజేపీ డిస్టిక్ట్ ప్రెసిడెంట్ పోస్టులు లభించగా.. ఎస్టీలకు అవకాశం ఇవ్వలేదు. మొత్తంగా 27 జిల్లాల అధ్యక్షుల్లో ఒక మహిళ ఉన్నారు.
జనగామ చౌడ రమేష్, ఆసిఫాబాద్ శ్రీశైలం ముదిరాజ్, కామారెడ్డి నీలం చిన్న రాజులు, ములుగు బలరాం, మహబూబ్ నగర్ శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల యాదగిరి బాబు, మంచిర్యాల వెంకటేశ్వర్లు గౌడ్‌పెద్దపల్లి సంజీవరెడ్డి ,ఆదిలాబాద్ బ్రహ్మానందరెడ్డిలు నియమితులు అయ్యారు.

# తెలంగాణలో కులగణన చేసి చూపాం



**దేశ వ్యాప్తంగా చేపట్టాల్సిన అవసరం ఉంది**
**మోడీ మేకిన్ ఇండియా అట్టర్ ఫ్లాప్**
**నిరుద్యోగ సమస్యపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం**
**అమెరికా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం అందని మోడీ**
**రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో రాహుల్**
**రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి కిరణ్ రిజిజు**

న్యూఢిల్లీ, తెలంగాణలో కులగణన పూర్తి చేశాం.. ఈ కులగణనలో ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి.. అంటూ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో భాగంగా రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దేశంలో 90 శాతం జనాభా ఉన్న ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలకు హక్కులు దక్కడం లేదంటూ పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన పూర్తి చేశాం.. ఈ కులగణనలో ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి.. అంటూ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ జనాభాలో 90 శాతం మంది ఓబీసీలు.. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉన్నారంటూ రాహుల్ గాంధీ వివరించారు. బీజేపీలో కూడా 50 శాతం మంది ఎంపీలు ఓబీసీ వర్గానికి చెందిన వాళ్లేనని, కానీ వాళ్లకు మాట్లాడే అధికారం లేదంటూ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టినప్పుడే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. దీని కోసం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగంలో కొత్త విషయాలు లేవని.. నిరుద్యోగ సమస్యను నుంచి దేశం బయట పడలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా వల్ల ఎలాంటి మార్పు జరగలేదని వివరించారు. ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా నినాదం మంచిదే అయినప్పటికీ.. దాని లక్ష్యం నెరవేరడం లేదన్నారు. నిరుద్యోగ సమస్యను అప్పటి యూపీఏ ప్రభుత్వంతో పాటు ఇప్పటి ఎన్డీఏ సర్కార్ కూడా పరిష్కరించ లేదన్నారు. ఉత్పత్తి రంగంలో చైనా మనకంటే పదేళ్లు ముందుందని, భారత్ పూర్తిగా వెనకబడి పోయిందంటూ పేర్కొన్నారు. తయారీరంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. మహారాష్ట్ర



# డిప్యూటి సిఎం భట్టితో బిసి కమిషన్ సభ్యుల భేటీ

హైదరాబాద్: డిప్యూటీ సిఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో బీసీ కమిషన్ సమావేశం అయ్యింది. ఉమ్మడి జిల్లాల పర్యటనలో పలు కులాల పేరు మార్పు అభ్యంతరాలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ , బీసీ కమిషన్ సభ్యులు మహాత్మా జ్యోతిభాపూలే ప్రజా భవన్ లో మల్లు భట్టి విక్రమార్క తో భేటీ అయ్యారు. ఇప్పటికే బీసీ కమిషన్ 10 ఉమ్మడి జిల్లాల పర్యటన తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొన్ని కులాల పేర్లు మార్పులు, అభ్యంతరాలు స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను వివరించారు. బిసి కమీషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి రంగు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో చర్చించడం జరిగింది. వివిధ విజ్ఞప్తులను
వాటి పర్యవసానాలను మంత్రితో కూలంకషంగా చర్చించడం జరిగింది. బిసి కమిషన్ కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేయాల్సిన విషయమై సవివరంగా చర్చించారు.

## కెసిఆర్‌కు లీగల్ నోటీసులు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ కు లీగల్ నోటీస్ జారీ అయ్యింది. అసెంబ్లీకి గైర్హాజరు నేపథ్యంలో కేసీఆర్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ ఇవాళ ఈ నోటీసులు పంపింది. అసెంబ్లీకి హాజరుకాని కేసీఆర్‌పై అనర్హత వేటు వేయాలని, శాసన సభలో అపోజిషన్ లీడర్‌గా తన కర్తవ్యాన్ని నిర్వర్తించని మాజీ సీఎం కేసీఆర్‌కు సభలో సభ్యునిగా కొనసాగే అర్హత లేదని నోటీసులో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కేసీఆర్ పోరాటం చేయాలని, లేదంటే అసెంబ్లీకి రాని కేసీఆర్‌ను వెంటనే అపోజిషన్ లీడర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు స్పీకర్ సమన్లు జారీ చేసి వివరణ కోరాలని పేర్కొంటూ అసోసియేషన్ తరపు న్యాయవాది పాదూరి శ్రీనివాస్ రెడ్డి మెయిల్, స్పీడ్ పోస్ట్ ద్వారా లీగల్ నోటీసులు పంపించారు.

## బిజెపి అక్రమాలను అడ్డుకునే చర్యలు

### స్పై కెమరాలు పంచామన్న కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ బుధవారం జరగనుండగా, బిజెపి, ఆ పార్టీ 'గూండాల' 'తప్పుడు పనులు, ఎన్నికల అక్రమాల'ను నమోదు చేయడానికి మురికివాడల్లో ప్రజలకు స్పై కెమెరాలు, బాడీ కెమెరాలను తమ పార్టీ పంచిందని ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ సోమవారం వెల్లడించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కేజ్రీవాల్ ఒక వీడియో సందేశం విడుదల చేస్తూ, ఆప్ చరిత్రాత్మక విజయం సాధించబోతున్నదని, బిజెపి తన ఆవిర్భావం తరువాత అత్యంత దారుణ పరాజయం ఎదుర్కొనబోతున్నదని, అందుకే అది 'అక్రమ ఎత్తుగడలకు' పూనుకుంటున్నదని పేర్కొన్నారు. బిజెపి గూండాల దుష్కృత్యాలను ఫోటోలు తీయడానికి గాను మేము మురికివాడల వాసులకు స్పై కెమెరాలు, బాడీ కెమెరాలు పంచాం. మేము పలు శీఘ్ర స్పందన బృందాలు (క్యుఆర్‌టిలు) కూడా ఏర్పాటు చేశాం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవడానికి, ఆ దుండగులు అరెస్టయ్యేలా చూడడానికి వారు పావు గంటలోగా అటువంటి ప్రదేశాలకు చేరుకుంటారు' అని ఆప్ చీఫ్ తెలిపారు. 'ఎన్నికల్లో విజయం కోసం బిజెపి తమ గూండాలను, ఢిల్లీ పోలీసులను విస్తృతంగా ఉపయోగించుకుంటుంది. వారు వోటర్లను, ముఖ్యంగా మురికివాడల్లోని వారిని బెదరించే యత్నం చేస్తారు' అని ఆయన ఆరోపించారు. బిజెపి కార్యకర్తలు మురికివాడల వాసులకు రూ. 3000 నుంచి రూ. 5000 వరకు ఇవ్వజూపి, ఎన్నికల రోజు వారిని వోటు చేయనివ్వకుండా నివారించేందుకు నల్ల ఇంకుతో వారి వేళ్లపై ముద్ర వేయజూస్తారని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు.

'వారి డబ్బు తీసుకోండి, కానీ మీ వేలిపై ఇంకు ముద్ర వేయనివ్వకండి' అని ఆయన వోటర్లకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బుధవారం (5న) పోలింగ్ జరగనున్నది. ఫలితాలను 8న ప్రకటిస్తారు.

## ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి తెర

### 5న ఎన్నికలకు భారీగగా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. సాయంత్రం 5గంటలకు అన్ని రాజకీయ పార్టీల మైకులు మూగబోయాయి. 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8వ తేదీన వారి భవితవ్యం తేలనుంది. పోలింగ్‌కు ముందు రెండు రోజులు కీలకం కావడంతో అప్రమత్తమైన ఎన్నికల సంఘం ప్రలోభాలను అరికట్టేందుకు నిఘా పెంచింది.

చివరి రోజున రాజకీయ పార్టీలు హోరాహోరీ ప్రచారం నిర్వహించాయి. అధికారం కాపాడుకునేందుకు అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ అనేక హామీలతో ప్రజల్లోకి వెళ్లింది. రెండు దశాబ్దాలకు పైగా అధికారానికి దూరమైన భాజపా చివరి రోజు 22 రోడ్ షోలు నిర్వహించింది. ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేసింది. 2013కు ముందు పదిహేనేళ్లు పాలించిన కాంగ్రెస్.. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేసింది. మరోవైపు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సంఘం ప్రకారం.. దిల్లీలో 1.56కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరికోసం 13,766 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా.. ఇందులో దివ్యాంగుల కోసం 733 కేంద్రాలున్నాయి.

పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీని తెలుసుకునేందుకు క్యూ మేనేజిమెంట్ సిస్టమ్ అప్లికేషన్‌ను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ముందస్తు పోలింగ్ సదుపాయం కల్పించగా.. ఇప్పటికే 7,980 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ నేపథ్యంలో దేశ రాజధానిలో భారీ సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు. 200 కంపెనీలకు పైగా సాయుధ బలగాలు, 15వేల మంది హోంగార్డులు, 35వేల మంది దిల్లీ పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. 3వేల పోలింగ్ బూత్‌లను సున్నితమైనవిగా గుర్తించిన ఎన్నికల అధికారులు.. కొన్ని ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జనవరి 7 నుంచి ఇప్పటివరకు 1049 కేసులు నమోదయ్యాయి. లక్ష లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడంతోపాటు 1353 మందిని అరెస్టు చేశారు. రూ.77కోట్ల విలువైన 196 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## కుంభమేళా తొక్కిసలాట దుర్ఘటన దురదృష్టకరం

**న్యూఢిల్లీ:** కుంభమేళా తొక్కిసలాట సంఘటన దురదృష్టకరమని, ఆందోళన కలిగించే విషయమని సోమవారం సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఈ సంఘటనకు సంబంధించి ఉత్తరప్రదేశ్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ దేశ వ్యాప్తంగా వచ్చే భక్తుల భద్రత విషయంలో ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్‌ను తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విశాల్ తివారీ అనే న్యాయవాది ఇటీవల సుప్రీం కోర్టులో పిల్ వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన విధానపరమైన మార్గదర్శకత్వాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. దీనిపై యూపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ సంఘటనపై జ్యుడీషియల్ దర్యాప్తు జరుగుతోందని, ఇదే తరహాలో ఓ పిల్ హైకోర్టులో దాఖలైందని సుప్రీంకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనల విన్న అత్యున్నత న్యాయస్థానం తాజా ఆదేశాలు ఇచ్చింది.

# తెలంగాణలో కులగణన చేసి చూపాం



అసెంబ్లీ ఎన్నికల్లో గోల్‌మాల్ జరిగిందని తీవ్ర ఆరోపణలు చేశారు రాహుల్‌గాంధీ. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్నారు. ఎన్నికలకు ముందు ఐదు నెలల్లో 70 లక్షల ఓటర్లను చేర్చారని, దీనిపై ఈసీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఐదు నెలల్లో కొత్తగా 70 లక్షల ఓటర్లు చేర్చారని.. షిర్డీలో ఒకే భవనంలో 7000 ఓటర్లను చూపించారంటూ రాహుల్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు పెరిగారని.. ఈసీ ఓటర్ల డేటాను విడుదల చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇకపోతే ప్రధాని నరేంద్రమోడీకి, అమెరికా ప్రెసిడెంట్‌గా డొనాల్డ్ ట్రంప్ స్వీకారోత్సవానికి ఆహ్వానంపై ఆయన ఆరోపణలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారింది. రాహుల్ వ్యాఖ్యల్ని అధికార పక్షం తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలోని బిజెపి ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. దేశ విదేశాంగ విధానానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రకటనలు చేయవద్దని అన్నారు.

డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆహ్వానం పొందడానికి విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ని అమెరికాకు పంపాల్సిన అసవరం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎగతాళి చేస్తూ, ఆర్థిక విధానాలను తీవ్రంగా పరిగణించాల్సి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. 'మేము అమెరికాతో మాట్లాడినప్పుడు, మా ప్రధానమంత్రి ఆహ్వానం కోసం విదేశాంగ మంత్రిని మూడు-నాలుగు సార్లు పంపము ఎందుకంటే మాకు పొడక్షన్ సిస్టమ్ ఉంది, మనం ఈ సాంకేతిక పరిజ్ఞానాలపై పని చేస్తుంటే, అమెరికా అధ్యక్షుడు ఇక్కడికి వచ్చి ప్రధానమంత్రిని ఆహ్వానిస్తారు' అని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.దీనిపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 'ప్రతిపక్ష నాయకుడు అంత తీవ్రమైన, ఆధారాలు లేని ప్రకటనలు చేయవద్దు. ఇది రెండు దేశాల సంబంధాలకు సంబంధించిన విషయం. ఆయన దగ్గర ఆధారాలు ఉంటే, విదేశాంగ మంత్రి ఏ ప్రయోజనాల కోసం అమెరికా వెళ్లారో చెప్పాలని సవాల్ చేశారు. రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తుతూ.. లడఖ్‌లో చైనా సైన్యం చొరబాటు గురించి ప్రధాని చేసిన వాదనలకి విరుద్ధంగా భారత సైన్యం వాదలు ఉన్నాయనడంపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మాట్లాడే మాటలకు ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.

## దేశవ్యాప్తంగా ఒకే టోల్ విధానం

న్యూఢిల్లీ: ఒకే రకమైన టోల్ విధానం అమల్లోకి తసీఉకుని వచ్చే అవకాశం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహన దారులందరికీ ఒకేరకమైన టోల్ విధానం అమలయ్యేలా 'ఏకరీతి టోల్ విధానం'పై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఇది చెక్ పెట్టనుందని తెలిపారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. రోడ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం, అధిక టోల్ ఛార్జీలు విధిస్తుండడంపై వాహనదారుల్లో అసంతృప్తి గురించి ప్రస్తావించిన సందర్భంలో ఏకరీతిన టోల్ విధానం గురించి గడ్కరీ మాట్లాడారు. అయితే, దీనికి సంబంధించిన అదనపు వివరాలేవీ పంచుకోలేదు. ప్రస్తుతం మన రోడ్లు అమెరికా రహదారులతో సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. తొలుత గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ఆధారంగా పనిచేసే టోల్ విధానాన్ని అమలుచేస్తామని చెప్పారు.సోషల్‌మీడియాలో రోడ్లపై వచ్చే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తామని, సంబంధిత కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని గడ్కరీ హెచ్చరించారు. ప్రస్తుతం జాతీయ రహదారులపై 60 శాతం ట్రాఫిక్‌కు కార్లే కారణమని పేర్కొన్నారు. కానీ, వాటిద్వారా వస్తున్న ఆదాయం 20-26 శాతం మాత్రమే ఉంటోందని చెప్పారు. దీనికితోడు గత పదేళ్లలో కొత్తగా టోల్ ఎ÷-లాజాలు పెరగడంతో పాటు, ఛార్జీలు పెరగడం కూడా ప్రజల్లో అసంతృప్తికి కారణమని వివరించారు. 2023-24లో టోల్ రూపంలో రూ.64,809.86 కోట్లు వసూలైందని కేంద్రమంత్రి తెలిపారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ మొత్తం 35 శాతం మేర పెరిగిందని చెప్పారు. 2020-21లో సగటున రోజుకు 37 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరిగిందని చెప్పారు. ఈ ఏడాది ఈ రికార్డును అధిగమిస్తామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 7 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరిగిందని చెప్పారు.

## సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావుకే పగ్గాలు

**నెల్లూరు:** భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్).. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా వి. శ్రీనివాసరావు తిరిగి ఎన్నికయ్యారు .. నెల్లూరులో 27వ ఏపీ రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యదర్శిగా వి శ్రీనివాసరావు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. 49 మందితో కూడిన నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మరోవైపు.. 15 మందితో నూతన కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు.. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వెంకటేశ్వరరావు, బాబురావు, ప్రభాకర్ రెడ్డి, రమాదేవి, తులసీదాస్, వెంకటేశ్వర్లు, లోకనాథం, సురేంద్ర, సుబ్బరావమ్మ, రాంభూపాల్, ఉమామహేశ్వరరావు, బలరాం, మూలం రమేష్, ఏవీ నాగేశ్వరరావులను ఎంపిక చేశారు.. వీరిలో ఏవీ నాగేశ్వరరావు (ఎన్టీఆర్ జిల్లా), బి. బలరాం (పశ్చిమ గోదావరి జిల్లా)ను కొత్తగా కార్యదర్శి వర్గంలోకి తీసుకున్నారు.. కార్యదర్శి, కార్యదర్శివర్గంతో కలిసి ఉన్న 50 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో ఏడుగురు ఆహ్వానితులు, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులు ఉన్నారు.. నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించే పార్టీగా ఉన్న సీపీఎం.. తన ప్రజా సంఘాలతో మరింత ఉధృతంగా ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధమవుతోంది..

## 30 ఏళ్లుగా శాంతియుత ఉద్యమం చేశాం

**హైదరాబాద్:** తమ ఉద్యమంలో గత 30 ఏళ్లలో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా తమ ఉద్యమం సాగిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెప్పుల తయారీ, డప్పు వాయిద్యం తమకు వారసత్వంగా వచ్చాయన్నారు. తమ మూలాలు కాపాడుకునేందుకు త్వరలో సాంస్కృతిక కార్యక్రమం చేపడతామని చెప్పారు. 'ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994లో మొదలుపెట్టాం. 1996 మార్చిలో మొట్టమొదటి బహిరంగసభ నిర్వహించాం. ఉద్యమ విస్తరణ కోసం మొదటి రెండేళ్లు పనిచేశాం. వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించాం.లక్షలమందిని సమీకరించినా ఎప్పుడూ సమస్య రాలేదు. ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదు. అలా చేస్తే ఇన్నేళ్లు ఉద్యమం నిలబడేది కాదు. అస్తిత్వం కోసమే మా సాంస్కృతిక ప్రదర్శన. దీనికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం అన్యాయం. ఆరు అంశాలు చూపుతూ అనుమతి నిరాకరిస్తూ నోటీసులు ఇచ్చారు. దానికి వివరణ ఇస్తూ మరో వినతిపత్రం ఇస్తాం. గాంధేయ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తాం. లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమానికి సీఎం అనుమతి ఇవ్వాలి. ఫిబ్రవరి 7న కార్యక్రమం అనుమతికి మరోసారి వినతిపత్రం ఇస్తాం. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా కార్యక్రమం ఉండబోతోంది.' అని మందకృష్ణ మాదిగ అన్నారు.

## కృత్రిమ మేథలో రాణించేలా ఎఐ వర్సిటీ

**హైదరాబాద్:** తెలంగాణ యువతను 'కృత్రిమ మేధ'లో నిపుణులుగా తీర్దిదిద్దాలనే సంకల్పంతో ఏఐ సిటీలో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని నిర్మించ బోతున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ.. హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దాన్ని తీర్చి దిద్దుతామన్నారు. ఈ వర్సిటీ నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తోన్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని శ్రీధర్‌బాబు ప్రారంభించారు. డీటీసీసీ.. భారత్‌లో తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 500 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 2వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'యువత వినూత్నంగా ఆలోచించాలి. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయి. కానీ.. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. 100 నుంచి 120 కంపెనీలు హైదరాబాద్ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయి. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉంది. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యమున్న మానవ వనరులను మేం అందిస్తాం. నిశ్చింతగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చు' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## కృత్రిమ మేథలో రాణించేలా ఎఐ వర్సిటీ

**హైదరాబాద్:** తెలంగాణ యువతను 'కృత్రిమ మేధ'లో నిపుణులుగా తీర్దిదిద్దాలనే సంకల్పంతో ఏఐ సిటీలో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని నిర్మించ బోతున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ.. హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దాన్ని తీర్చి దిద్దుతామన్నారు. ఈ వర్సిటీ నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తోన్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని శ్రీధర్‌బాబు ప్రారంభించారు. డీటీసీసీ.. భారత్‌లో తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 500 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 2వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'యువత వినూత్నంగా ఆలోచించాలి. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయి. కానీ.. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. 100 నుంచి 120 కంపెనీలు హైదరాబాద్ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయి. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉంది. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యమున్న మానవ వనరులను మేం అందిస్తాం. నిశ్చింతగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చు' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## ఉప ఎన్నికలకు సిద్ధం కండి



**హైదరాబాద్:** బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు చూస్తుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పైనా వేటు పడుతుందన్నారు. అలాగే, ఫిరాయింపు దారులను కాంగ్రెస్ పార్టీ కాపాడడం అసాధ్యమన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యే వ్యవహారంలో కేటీఆర్ వేసిన పిటిషన్ విచారణ సోమవారం నాటికి వాయిదా పడింది. గతంలో ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌లతో కలిపి విచారిస్తామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఇక, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాలయాపన చేస్తున్నారని సుప్రీంకోర్టులో కేటీఆర్ జనవరి 29న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. అలాగే, ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై కూడా విచారణ కొనసాగుతుంది. ఈ క్రమంలో.. ఈ రెండు పిటిషన్లను కలిపి ఈ నెల 10వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో పార్టీ మారిన వారిపై వేటు పడటం ఖాయమని, ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్ , అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్‌లు కాంగ్రెస్‌లోకి పార్టీలో చేరారు. వీళ్లపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌కు కేటీఆర్ వేసిన పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. కేటీఆర్ వేసిన పిటిషన్‌ను.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు అనర్హత పిటిషన్‌తో కలిపి విచారిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. పాత పిటిషన్‌తో కలిపి కేటీఆర్ పిటిషన్‌పై విచారణ చేస్తామని చెబుతూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌పై రెండు రోజుల క్రితం సుప్రీంలో విచారణ జరుగగా.. సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ ఆలస్యం చేయడాన్ని తప్పుపట్టింది. ఇంకా ఎంత సమయం కావాలంటూ గత విచారణలో గట్టిగా ప్రశ్నించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేదాకనా అని ప్రశ్నించింది. స్పీకర్‌కు ఎంత సమయం కావాలో మీరే కనుక్కుని చెప్పాలంటూ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఆదేశించింది. ఆపై తదుపరి విచారణను వాయిదా వేసింది.

## బిసి కులగణనపై ప్రభుత్వం కాకి లెక్కలు

కరీంనగర్: బిసి కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కులగణన నివేదికపై సోమవారం కరీంనగర్ లో ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కులగణనతో కోటి 15 లక్షల ఇళ్లు, జనాభా 3. 70 కోట్లు అని తేల్చిందని , అయితే దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏ లెక్కన చూసినా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బిసిలు ఉన్నట్లు తెలుస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 46.2శాతం ఉన్నట్లు తేల్చారని ఆరోపణలు చేశారు. బిసిలు 46 శాతం ఉన్నారని సిఎం రేవంత్ రెడ్డి గుండె మీద చేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. కరెక్టే అయితే సర్వేలో తానిచ్చిన వివరాలు, తన పేరు ఆధార్ కార్డు కొడితే రావాలని చెప్పారు. సర్వే రిపోర్ట్ ను వెబ్ సైట్లో అందుబాటులో ఉంచాలని కవిత డిమాండ్ చేశారు. కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మిస్ అయిన వారి కోసం మళ్లీ అవకాశం ఇవ్వాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. శాసనసభలో లఘు చర్చతో లాభం లేదన్నారు. బీసీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపని ప్రశ్నించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెద్దపల్లికి చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేమెంతుంటే.. మాకంత వాటా అంటూ రాహుల్ గాంధీ నినాదం ఇచ్చారని గుర్తుచేశారు. దానిప్రకారం 46.3 శాతం బీసీలు, 10 శాతం బీసీ ముస్లింలు.. మొత్తం కలిపి 56 శాతం జనాభా ఉందని చెప్పారు. రిజర్వేషన్లను అమలు చేయాలంటూ రాజ్యాంగం పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ.. బీసీల విషయంలో ఎందుకు వెనక్కితగ్గుతున్నారని నిలదీశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇండ్లు, 3.5 కోట్ల జనాభా ఉన్నట్లు తేలిందని చెప్పారు. 2014లో నాటి సీఎం కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.03 కోట్ల ఇండ్లు, 3 కోట్ల 68 లక్షల జనాభా అని తేలిందని వెల్లడించారు. అప్పుడు నాలుగేండ్ల వ్యవధిలో చేసిన సర్వేలోనే 20 లక్షల ఇండ్లు, పెరిగాయి. 2014-2024 వరకు పదేండ్లలో ఎన్ని ఇండ్లు, ఎంత జనాభా పెరిగి ఉండాలన్నారు. ఎన్ని కుటుంబాలు పెరగాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కుల గణనతో కోటి 15 లక్షల ఇళ్లు ఉన్నాయని, రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు అని చెబుతున్నదని తెలిపారు. 2011 నుంచి 14 వరకు 20 లక్షల ఇండ్లు పెరిగితే.. 2014 నుంచి పదేండ్లలో సుమారు 60 లక్షల కుటుంబాలు పెరగాలన్నారు. ఏ లెక్కన చూసినా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బీసీలు ఉన్నట్లు తెలుస్తుందని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 46.2శాతం ఉన్నట్లు తేల్చడం బాధాకరమని చెప్పారు. ఇది ఎంతవరకు సబబని సీఎం రేవంత్ రెడ్డి గుండెమీద చేసుకుని చెప్పాలన్నారు. ఈ కాకి లెక్కలతో అయినా బీసీల రిజర్వేషన్ల పెంచడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇదే తరహా మోసాన్ని బీహార్, కర్ణాటకలో చేసిందని విమర్శించారు. తెలంగాణలో కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సకల జనుల సర్వేకు, ఇప్పటి ఈ సర్వేకు 21 లక్షల బీసీ జనాభా తేడా కనిపిస్తున్నదని చెప్పారు. సకల జనుల సర్వేలో ఓసీల జనాభా చాలా తక్కవ అని తేలిందని, ఇప్పుడు చాలా ఎక్కువగా కనిపిస్తున్నదని వెల్లడించారు. దీని వెనుకున్న మతలబు ఏమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. కేవలం ఓసీల జనాభా పెరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గుతుందా అని ప్రశ్నించారు. సకల జనుల సర్వే ద్వారా కేసీఆర్ మొదటి అడుగు వేశారని, ఆ సర్వే డేటా ఆధారంగా కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఉద్యమాల వల్ల బీసీ జనాభా వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేసిందన్నారు. దీన్ని ప్రజాస్వామిక వాదులంతా స్వాగతించాలని చెప్పారు. తెలంగాణ జాగృతి ఉద్యమాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. డెడికేటెడ్ కమిషన్ ద్వారానే కులగణన జరగాలని కోరినా ప్రభుత్వం ఎ÷-లానింగ్ శాఖ చేత సర్వే చేయించిందని విమర్శించారు. సర్వే సరిగ్గా జరలేదని ప్రతి ఒక్కరి మనసుల్లో ఉందని చెప్పారు. తమ ఇండ్లకు సర్వే కోసం రాలేదని ప్రతీ గ్రామంలో చాలా మంది అంటున్నారని వెల్లడించారు. సర్వే సరిగ్గా జరగకపోతే డేటా వాస్తవమైనదా కాదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వెల్లడించారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం సర్వే డేటాను సమీక్షకు పెట్టాలని డిమాండ్ చేశారు. 3.5 కోట్ల సర్వే పత్రాలను ప్రజల స్క్రూటినికీ అందుబాటులోకి పెట్టాలని, స్క్రూటినీకి 15 రోజుల సమయం ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో దీనిపై కేవలం స్వల్పకాలిక చర్చ పెడుతామని ప్రభుత్వం చెప్పడం బాధాకరమని చెప్పారు. బీసీలంటే అంత చిన్న చూపు ఎందుకని ప్రశ్నించారు. చిన్న చర్చ పెట్టి ఏం లాభం చేస్తారని నిలదీశారు. బీసీ అంశాలు, ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజకీయాలు తగదన్నారు.

జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020
ఉదయం న్యూస్

# సంపాదకీయం


## యమునా కాలుష్యం నివారణపై కానరాని చిత్తశుద్ధి !

ఢిల్లీ ఎన్నికల పుణ్యమా అని..యమునా కాలుష్యంపై మరోమారు పతాక శీర్షికలో వార్తలు చెలరేగాయి. ఈ విషయంలో ఇంతకాలం అటు ఢిల్లీ ప్రభుత్వం కానీ, ఇటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కానీ పట్టించు కోవడం లేదు. గంగా కాలుష్యం గురించి పదేళ్లుగా వల్లెవేస్తున్న మోడీ దానిని పునరుజ్జీవింపచేసే ప్రయత్నాలు పెద్దగా చేయడం లేదు. యమునా కాలుష్యానికి కారణం ఈ రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యం తప్ప మరోటి కాదు. కాలుష్యాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తామని ఇరు పార్టీలు ఎక్కడా ప్రకటించలేదు. ప్రజలపై చిత్తశుద్ధి లేదనడానికి వీరి ప్రచార తీరే నిదర్శనం. ప్రధానంగా బిజెపి గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉంది. ఆప్ కూడా పదేళ్లుగా ఢిల్లీలో అధికారంలో ఉంది. అయినా ఈ సమస్యను పదేళ్లలో గుర్తించి చర్యలకు ఉపక్రమించలేదు. ఎక్కడా వీరికి చిత్తశుద్ధి కానరాలేదు. నీటి కాలులష్యాన్ని రాజకీయ కోణంలో చూపించి, లబ్ది పొందాలన్న దుగ్ధ రెండు పార్టీలది. వీరికి చిత్తశుద్ధి లేదని చెప్పడానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ అక్కర్లేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనున్నాయి. ఈ క్రమంలో బిజెపిని దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగా యమునా కాలుష్యంపై దుమారం రేపారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సిన బిజెపి సహజంగానే ఎదురుదాడికి దిగింది. కేజ్రీవాల్ తీరును తప్పు పట్టింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పాగా వేసే ప్రయత్నంలో ఉన్న బిజెపి ఆప్ ను దెబ్బతీసేందుకు చేయని ప్రయత్నం లేదు. ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి పార్టీ మారేలా చేస్తున్నారు. అలాగే యమున విషయంలో కూడా సానుకూలంగా స్పందించి కాలుష్యరహిత యమునను చేద్దామన్న సంకల్పం ప్రకటించలేదు. ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి ఆమ్ఆద్మీ పార్టీ, బిజెపి, కాంగ్రెస్ పోటీపడుతున్నాయి. ముఖ్యంగా ఆమ్ఆద్మీ పార్టీకి ఈసారి గెలిచే అవకాశం లేకుండా బిజెపి సర్వశక్తులూ ఒడ్డుతోంది.ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, జెపి నడ్డాలు ప్రచారంలో దూకుడు పెంచారు. కేజీవ్రాల్పై విమర్శలు గుప్పించడంలో భాగంగా యమునా కాలుష్యంపై ఎదురుదాడికి తెగించారు. అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈసారి తమదే విజయమని ఢంకా బజాయిస్తున్నారు. మరోవైపు కేంద్రమంత్రులు రాజ్నాథ్ సింగ్, జెపి నడ్డా, యపి సిఎం యోగి ఆదిత్యానాథ్ తదితరులు ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు.ఈ తరుణంలో యమునా నదిపై రగడ ఆమ్ఆద్మీ, బిజెపి పార్టీల మధ్య వ్యవహారం రచ్చగా మారింది. యమునానది కాలుష్యం కావడానికి హర్యానా ప్రభుత్వమే కారణమని కేజీవ్రాల్ ఆరోపించడం రాజకీయ దుమారం రేపింది. యమునను విషతుల్యం చేశారని ఆరోపించారు. తాను బతికి ఉన్నంతవరకు యమునా నది నీటిని ఢిల్లీ ప్రజలు తాగకుండా చేస్తానని కూడా కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రధాని తాగే నీటిలో ఎవరైనా విషం కలుపుతారా అంటూ కేజ్రీవాల్ తీరుపై ప్రధాని మోడీ మండిపడ్డారు. మొత్తంగా ఇదో ఎన్నికల ప్రచారాశంగా మారింది. అంతేగానీ యమునా కాలుష్య నివారణకు సవాళ్లుగా మారివుంటే బాగుండేది. కానీ అలా చేసే దమ్ము,ధైర్యం వీరికి లేదు. అయితే యమున కాలుష్యంపై వచ్చి లేదా చేసిన ఆరోపణలపై మాత్రం హర్యానా ప్రభుత్వంతోపాటు కేంద్రఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఇది రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడమవుతుందని, ఢిల్లీ జల్బోర్డు ఉద్యోగులు విషాన్ని ఎలా గుర్తిస్తున్నారో చెప్పాలని ఎన్నికల కమిషనర్ కోరారు. ఈ మేరకు కేజ్రీవాల్కు నోటీసులు పంపారు. యమునా నదిలో అమోనియా కలియడంవల్ల విషపూరితం కాకుండా నివారించ వలసిన బాధ్యత ఢిల్లీ ఆప్ ప్రభుత్వానిదేనని ఎన్నికల కమిషనర్ గుర్తుచేశారు. మరోవైపు హర్యానా సిఎం నయాబ్సింగ్ సైనీ యమునా నదిని తాగడం వైరల్ అయింది. ఆయన నీటిని తాగినట్టు నటించారే తప్ప అసలు తాగలేదని, నోట్లోని నీటిని వెంటనే ఉమ్మేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. హర్యానా సిఎం నయాబ్
సింగ్ సైనీ యమునా నీటిని తాగి ఊసేసిన వీడియో క్లిప్ను కేజ్రీవాల్ పోస్టు చేశారు. అమోనియో కాలుష్యం కారణంగా యమునా నీరు ఢిల్లీ ప్రజలకు ప్రాణాంతకంగా మారిందన్న తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. మొత్తంగా యమునానది కాలుష్య కాసారాంగా మారిందన్నది నిజం. అది తాగడానికి పనికి రానంతంగా తయారయ్యిందన్నది కూడా నిజం, ఈ విషయంలో ఇరు ప్రభుత్వాలు చేతగానితనాన్ని బయటపెట్టుకున్నాయి. ఏ పార్టీ అయినా, ప్రభుత్వమైనా, ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయాలి. సమస్య ఉత్పన్నం అయితే స్పందించి, పరిష్కార మార్గం చూపాలి. కానీ అలా జరగడం లేదన్నదే బాధ. తాగునీటి సమస్యను పరస్పరం భూతద్దంలో చూపించి ఓట్లవేట సాగించడం దుష్టరాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న యమునా నది రగడ కూడా అంతే. ఎన్నికలు వచ్చేవరకు యమునా నది సమస్య ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి పట్టలేదు. సమస్య ఉందని తెలిసి కూడా పట్టించుకోలేదు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్ యమునా నదిని ప్రక్షాళనం చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ సమస్యను విస్మరించారు. ఢిల్లీ ఒక్కటే కాదు...ప్రధాన నదులు కాలుష్యకాసారాలుగా మారాయి. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ సమస్యలపై చిత్తశుద్ధి లేని ఈ పార్టీలకు గట్టిగా బద్ధి చెప్పాల్సి ఉంది. నదుల కాలుష్యానికి తీసుకుంటున్నచర్యలను కేంద్రం వివరించాలి. ఏ మేరకు ఎలాంటి ప్రయత్నాలు చేశారో చెప్పాలి. ఎంతకాలంలో నదుల కాలుష్యాన్ని అరికట్టగలరో ప్రజలకు హామీ ఇవ్వాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు.

# ఒక్క అధికారి కోసం

బద్వేలు ఉదయం ప్రతినిధి





కడప జిల్లా బద్వేలు కు అత్యంత సమీపంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి నియామక అంశం లో వారసుల మధ్య వివాదం ఉండటం వలన మఠాలకు ఈవోను నియమించే అవకాశం లేనందున ఆనాటి జగన్ సర్కార్ 2021 లో దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం లో నిబంధన ప్రకారం జిల్లా అసిస్టెంట్ కమీషనర్ శంకర్ బాలాజీకి ఫిట్ పర్సన్ గా తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేసింది. అయితే నియమ నిబంధనలు పాటించకుండా దాతల సహకారం భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి పేరిట మఠం నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టేశారు. వారసులకు కనీస విలువ లేదు. వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించకుండా వారిని తిలకించండి అని వ్రాతపూర్వక ఉత్తర్వులు ఇస్తూ మఠాన్ని గుడిగా మార్చే ప్రయత్నం చేశారు చేస్తున్నారు. అప్పట్లో ఈ విషయం పై నోరు మెదిపితే నాపై కేసులు పెట్టే ప్రయత్నం చేశారు. మఠం వారసులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలి అని తదుపరి మరో కేసులో హైకోర్టు మధ్యంతర ఆదేశాలు. ప్రభుత్వం మారినా అదే అధికారి అదే తీరు. ఈసారి మరింత ఉద్ధృతం. వద్దు అని వారిస్తున్నా సమాధుల ధ్వంసం. ఇదే జగన్ హయాం లో జరిగి ఉంటే హిందువుల మనోభావాలు భారీగా దెబ్బతిని రచ్చ చేసేవారు. మఠాధిపతి ద్వితీయ భార్య ఫిర్యాదు చేస్తే విచారణలో మఠాధిపతి ప్రధమ కుమారుడితో బలవంతం గా తమకు అనుకూలంగా స్టేట్మెంట్ ఇప్పించుకున్నారు. విచారణ నుంచి రక్షణ పొందారు ఆ అధికారి.ఇక్కడ మరో కీలక అంశం ఏంటంటే సాధారణ బదిలీల్లో వీరు కూడా బదిలీ కావాలి. ఆనాటి ధార్మిక పరిషత్ ఉత్తర్వుల ప్రకారం జిల్లా కొత్త ఏసి .. ఫిట్ పర్సన్ గా కొనసాగాలి. కానీ ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకుని ఈవోగా వచ్చారు. ఇది తప్పు మఠం స్వయం ప్రతిపత్తికి ముప్పు అని చెబితే నన్ను నోరు మెదపొద్దు అని నాయకులు వారించారు. మీకు వచ్చిన ఉత్తర్వులు ఏంటి అని అడిగినందుకు మఠాధిపతి ద్వితీయ భార్య పైనే కేసు నమోదు చేయించారు. వారు హైకోర్టు ఆశ్రయించారు.మూడు రోజుల క్రితం హైకోర్టు వారి నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. ఏ అధికారి అయినా పై స్థాయికి వెళ్లాలని కోరుకుంటారు కానీ ఈ అధికారి దిగువ పోస్ట్ కోసం పంతం పట్టారు. పంతం పట్టిన అధికారి కోసం నాయకులు పావులు కదుపుతున్నారు. హైకోర్టు , ధార్మిక పరిషత్ పై ఈ ప్రభుత్వానికి గౌరవం ఉంటే ధార్మిక పరిషత్ నిర్ణయం ప్రకారం ప్రస్తుత జిల్లా ఏసికి అదనపు బాధ్యతలు ఇవ్వాలి. అయితే ఆ ఒక్క అధికారి కోసం ధార్మిక పరిషత్ లో 21 మంది సభ్యులు గత నిర్ణయాన్ని సవరించి నిర్ణయం తీసుకోకుండా నలుగురు సభ్యుల తో నిర్ణయం తీసుకోవాలి అని అడుగులు. ఈ నిర్ణయం నిలబడదు మళ్ళీ సస్పెండ్ చేస్తారు అని తెలిసి కూడా ఆ వైపే మొగ్గు చూపుతున్నారు అని సమాచారం. ఆ ఒక్క అధికారి కోసం ప్రభుత్వ ప్రతిష్టను పణంగా పెడతారా నిబంధనలు ప్రకారం నిర్ణయం తీసుకుంటారా అనేది నేడో రేపో దేవాదాయ ధర్మాదాయ శాఖ కీలక అధికారుల నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది.

## నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం..!!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



హైదరాబాద్ బీసీ రిజర్వేషన్లు ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఒక్క రోజు చర్చ 15 నుంచి బడ్జెట్ సమావేశాలు17న రాష్ట్ర బడ్జెట్కు అవకాశంఒకట్రెండు రోజులు అటు ఇటుగాపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్..మంగళవారం శాసనసభ, శాసనమండలి సమావేశం కానున్నాయి. సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని అసెంబ్లీ కార్యదర్శి వి. నర్సింహాచార్యులు తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ ధ్రువీకరించారని ఆయన పేర్కొన్నారు.ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా లేఖలు పంపినట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ తదితర అంశాలపై నిర్వహించనున్న ఈ ప్రత్యేక సమావేశాలను ఒక్క రోజులోనే ముగించనున్నారు.17న రాష్ట్ర బడ్జెట్:అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈ నెల 15 నుంచి నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బడ్జెట్ సమావేశాల తొలిరోజున గవర్నర్ ప్రసంగం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అనంతరం 17న రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఒకట్రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించి, సభను వాయిదా వేస్తారని, పద్దుల పై చర్చ, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ వంటివాటిని మార్చి రెండో వారంలో చేపడతారని తెలిసింది.బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత, ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించే మధ్యకాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తుందని చెప్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి కూడా ఇదే నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 15లోగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో బడ్జెట్కు ఒక రోజు ముందుగాని, వెనుక గాని పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

## బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి తల్లి తులసమ్మ మృతి నివాళులు అర్పించిన బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పలువురు నాయకులు



బద్వేలు ఉదయం ప్రతినిధి

బద్వేల్ మున్సిపాలిటీ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి మాతృమూర్తి నిన్నటి రోజున అకాల మరణం చెందినారు. ఈ విషయం తెలిసిన వెంటనే బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యురాలు డా దాసరి సుధ వారి స్వగృహం పంగావాండ్ల పల్లె లో వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులు అర్పించారు వీరి వెంట నియోజక వర్గ బూత్ కన్వీనర్లు అధ్యక్షుడు రమణా రెడ్డి, జిల్లా యస్.సి సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు శ్రీ శ్రీరాములు, చెన్నక్రిష్ణా రెడ్డి, మాధవ్ రెడ్డి, ,జిల్లా సెక్రటరీ హరి కృష్ణ రెడ్డి, రఘురాం రెడ్డి, సుబ్బారెడ్డి, మౌలాలి,శేఖర్ పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు తులసమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని పరామర్శించారు .

## కుల గణనపై వేసిన సబ్ కమిటీ భేటీ

### సబ్ కమిటీకి నివేదిక ఇచ్చిన అధికారులు

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన నివేదికను ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉప సంఘానికి అందజేసిన అధికారులు..96.9శాతం మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు: మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డికులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల జనాభా 17.43 శాతంఎస్టీల జనాభా 10.45 శాతంరాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతంముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతంముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతంరాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతంరాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం.

## బిఆర్ఎస్ 5 లక్షల మందితో కేసీఆర్ సభ..!

### త్వరలో గజ్వేల్లో నిర్వహణ ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండా

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాల పై నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది
గజ్వేల్లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. నేను కొడితే మామూలుగా ఉండదు తొందర్లోనే భారీ బహిరంగసభ పెడదాం అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇటీవలే పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే సభ నిర్వహణకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యమే అజెండాగా ఈ సభను నిర్వహించాలని కారు పార్టీ భావిస్తోంది. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్లోనే సభను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కేసీఆర్ ఆదేశాలతో ఆ పార్టీ నేతలు బహిరంగ సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని గుర్తించే పనిలో పడ్డారు. త్వరలోనే 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
సభకు అన్ని రకాలుగా అనువైన స్థలాన్ని గుర్తించిన తర్వాత ఏర్పాట్లు, జనం తరలింపు, ప్రజలను ప్రభావితం చేసేలా ఏయే అంశాలను ప్రస్తావించాలన్న దానిపై కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. కాగా, ఇటీవల జగిత్యాల నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా ఎన్నో ప్రభుత్వాలను చూశా కానీ, ఇలాంటి సర్కారును ఎన్నడూ చూడలేదు. ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత వచ్చింది, అని చెప్పిన విషయం తెలిసిందే. రైతు భరోసా, రుణమాఫీ, రైతు ఆత్మహత్యలు, నేతన్నలు, ఆటో కార్మికులు ప్రాణాలు తీసుకోవడం వంటి వాటిపై రేవంత్ సర్కారును కేసీఆర్ నిలదీస్తారని గులాబీ శ్రేణులు చెబుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్న అంశంతో పాటు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ సభలో లేవనెత్తుతారని పేర్కొంటున్నాయి.

## పంచాయతీ ఎన్నికలపై బిగ్ అప్డేట్:ఈ నెలలోనే షెడ్యూల్ రిలీజ్కు ఛాన్స్..!!





హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు ఫిబ్రవరి 15వ తేదీ లోపే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయనకు కొంతమంది కాంగ్రెస్ నాయకులు సాదా బైనామా, ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు అలాగే ఖరీఫ్లో మిగిలిపోయిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే జిల్లా కలెక్టర్ ముజిమ్మిల్లా ఖాన్ తో మంత్రి పొంగులేటి ఫోన్ చేసి ఖరీఫ్లో మిగిలిపోయిన రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో పుణ్యపురం గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు పెండింగ్లో ఉన్న సాదాబైనామా గురించి ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. వెంటనే మంత్రి స్పందించి సాదాబైనామా పరిష్కారానికి కేవలం ఒక్క నెల గడువు మాత్రమే ఇస్తామని అది కూడా ఈనెల 15న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎన్నికల ప్రక్రియ ముగిశాక భూభారతి లో ఒక నెలలో సాదా బైనామాల పరిష్కారానికి అవకాశం ఇస్తామని, ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు.
కాగా హైదరాబాద్లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర కుటుంబ సర్వే పై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చింది. ఎన్నికలకు సన్నద్ధమంటూ పంచాయతీ రాజ్, ఎన్నికల సంఘం అధికారులు చెప్పినట్లు సమాచారం. కాగా కులగణన నివేదిక కూడా కేబినెట్ సబ్ కమిటీకి అందింది. దీనిపై కేబినెట్ సమావేశంలో చర్చించాక ఈ నెల 5న జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు.

## నల్గొండలో ఏకంగా సీఐ నే బ్లాక్ మెయిల్ చేసిన నకిలీ విలేకర్ల ముఠా..?

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్




నల్గొండ జిల్లాలో నకిలీ విలేకర్ల ముఠా ఒకటి పోలీసులను టార్గెట్ చేసింది. అక్రమాలు బయటపెడతా అంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. వీరి డిమాండ్లకు ఓ సీఐ తలొగ్గడం గమనార్హం. 5 లక్షలు ఇవ్వాలని సదరు ముఠా డిమాండ్ చేయగా, వారి ఆగడాలు తట్టుకోలేక సీఐ తన మిత్రుడి ద్వారా 1.10 లక్షలు ముట్ట జెప్పినట్లు తెలుస్తోంది. అయిన ఇప్పటికీ ఆ ముఠా బెదిరింపులు ఆగలేదు. తాము డిమాండ్ చేసిన సొమ్ములో మిగతా 4 లక్షలు ఇవ్వాలంటూ వేధించడం ప్రారంభించింది.
ఈ ముఠా ఆగడాలు భరించలేక సదరు సీఐ తన శాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి
ఆ ముఠాలోని ఒక నకిలీ విలేకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఉదయం

# బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి తగ్గొద్దు..

## అవసరమైతే అంతకంటే ఎక్కువే ఇద్దాం: సీఎం రేవంత్..!!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్





ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అమలు సీఎం రేవంత్‌బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులకు కట్టుబడి ఉందాంప్రభుత్వ పరంగా అమలుకు న్యాయపరమైన సమస్యలొస్తే పార్టీ పరంగా అమలు చేద్దాంమంత్రుల సమావేశంలో సీఎం వెల్లడి.!హైదరాబాద్ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై వెనక్కి తగ్గేది లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతానికి తగ్గకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే. ఒకవేళ కులగణన నివేదిక, బీసీ డెడికేటెడ్ కమిషన్ బీసీలకు అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు సిఫార్సు చేస్తే.. ఆ మేరకు ఇచ్చేద్దాం, అని మంత్రులతో సమావేశంలో సీఎం అన్నట్టు తెలిసింది. ఎంత జనాభాకు అంతా వాటా అనే నినాదంతో రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నారని, ఈ నేపథ్యంలో దాన్ని రాష్ట్రం నుంచే మొదలుపెట్టి ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. ఇప్పటికే కులగణన నివేదిక పూర్తయింది. బీసీ డెడికేటెడ్ కమిషన్ కుడా బీసీ రిజర్వేషన్లపై రిపోర్ట్ రెడీ చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో మనం హామీ ఇచ్చాం. వార్డులు, పంచాయతీల వారీగా బీసీ రిజర్వేషన్ల పై బీసీ డెడికేటెడ్ మిషన్ సిఫార్సులు చేస్తుంది. దానికి అనుగుణంగా ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేద్దాం. అని మంత్రులతో సీఎం రేవంత్రెడ్డి అన్నట్టు తెలిసింది. అయితే బీసీ రిజర్వేషన్లు 42 శాతం గానీ, బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు చేసినంత గానీ అమలు చేస్తే. న్యాయపరంగా ఏమైనా సమస్యలు వచ్చే అవకాశం ఉందా? అనే దానిపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.
ఒకవేళ బీసీలకు ప్రభుత్వ పరంగా స్థానిక సంస్థల్లో గానీ, విద్య, ఉద్యోగాల పరంగా గానీ రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం కచ్చితంగా ఉంది. ముందు అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేద్దాం. ఒకవేళ ఎలాంటి ఇబ్బంది లేకపోతే యథావిధిగా ముందుకు వెళ్దాం. ఏమైనా సమస్యలు వస్తే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఎక్కడెక్కడా బీసీ రిజర్వేషన్లకు సిఫార్సులు చేస్తుందో.. ఆయా వార్డులు, పంచాయతీల వారీగా పార్టీ పరంగా బీసీ అభ్యర్థులను నిలబెడదాం. ఇదే పార్టీ నిర్ణయం. రాహుల్ గాంధీ ఆలోచన అని కూడా ఇదే అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. కింది స్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు, క్యాడర్లోకి ఈ సందేశాన్ని బలంగా తీసుకెళ్లాలని మంత్రులకు ఆయన సూచించారు. అవసరమైతే దీనిపై అసెంబ్లీలో ప్రకటన కూడా చేద్దామని సీఎం పేర్కొన్నట్టు ఓ మంత్రి తెలిపారు.మనం ఇస్తే వాళ్లూ ఇవ్వాల్సిందేబీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తే. మిగతా పార్టీలు కూడా కచ్చితంగా అమలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నట్టు తెలిసింది. ఇతర పార్టీలు కూడా బీసీ నినాదం ఎత్తు కుంటాయని, కాంగ్రెస్ఇచ్చినట్టే బీసీలకు సీట్లు కేటాయిస్తాయని ఆయన పేర్కొన్నారు. అన్ని అనుకున్నట్టుగా జరిగితే దేశంలోనే మొదటిసారి బీసీలకు తగిన స్థాయిలో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్?కు దక్కుతుందని సీఎం వ్యాఖ్యానించినట్టు తెలిసింది.ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీ రిజర్వేషన్లను తీసుకొచ్చి, అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కే దక్కాలని.. ఆ దిశగా ప్రచారం చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఇక ప్రభుత్వం తరపున రిజర్వేషన్లు అమలు చేస్తే వచ్చే న్యాయపరమైన చిక్కులకు సంబంధించి ప్రత్యేక లీగల్ టీం టీం ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే బీసీ రిజర్వేషన్ల అమలు, రిజర్వేషన్లు 50 శాతం క్యాప్ దాటడంపై ఏజీ నుంచి లీగల్ ఒపీనియన్ తీసుకున్నారు.



## ఓరి రాములా సినిమాలు చూసి చెడిపోయాడు..?

లక్కీ భాస్కర్ తరహాలో డబ్బు సంపాదించాలని ప్లాన్..చివారికీ అడ్డం గా బుక్ అయ్యాడు:

ప్రకాశం జిల్లా, ఉదయం న్యూస్

ఆయనొక సచివాలయ ఉద్యోగిఈ మధ్య నే లక్కీ భాస్కర్ సినిమా చూసి ఉన్నాడు అనుకుంటా, అదే తరహాలో పెన్షన్ సొమ్ము కొట్టేసాడు పోలీసులు కు అడ్డం గా దొరికిపోయాడు. లక్కీ భాస్కర్ సినిమాలో హీరో బ్యాంకు సొమ్మును వాడుకుని డబ్బులు సంపాదిస్తాడు. ప్రకాశం జిల్లామార్కాపురంలోని సచివాలయ కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు పింఛన్ సొమ్ము 2.66 లక్షలు తీసుకుని జనవరి 31న పారిపోయాడు. వివిధ బెట్టింగ్ యాప్‌లలో పెట్టి ఒక్క రోజులోనే 10 లక్షలు సంపాదించాలనుకొని మొత్తం పోగొట్టుకున్నాడు. బంధువులు డబ్బు చెల్లించడంతో పోలీసులు అతడిని వదిలేశారు.

## వనపర్తి నియోజకవర్గ పరిధిలోని SC, ST ఆవాస ప్రాంతాల రోడ్లకు మహార్దశ



వనపర్తిఉదయం న్యూస్

ఈ నిధుల మంజూరీకి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు సీతక్క కి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు కి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవికి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.
వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గిరిజన తండాలకు, ఎస్సీ కాలనీలలో రోడ్ల నిర్మాణాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది
స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారి ప్రతిపాదనలతో కూడిన అభ్యర్థనలకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు 16 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ జీవోల%అబ% జారీ చేసింది దీంతో నియోజకవర్గం పరిధిలోని పలు తండాలకు రహదారుల నిర్మాణం, నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ రహదారుల నిర్మాణంతో పల్లె ప్రాంతాల్లోని ఆవశప్రాంతాలన్నింటికీ రోడ్డు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ నిధుల మంజూరీకి సహకరించిన ప్రభుత్వ పెద్దలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు

# బాబు పాలనలో రాయలసీమకు ప్రతిసారీ అన్యాయం.

## .వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి, ఫిబ్రవరి 3: (ఉదయం ప్రతినిధి)



ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో ప్రతిసారీ రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని వైయస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం రాయచోటి వైయస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర నాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష లతో కలసి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు .సాగునీటి ప్రాజెక్ట్ ల నుంచి విద్యాసంస్థల ఏర్పాటు వరకు చంద్రబాబు ఏనాడు ఈ ప్రాంత అభివృద్ధిపైన చిత్తశుద్ధితో వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. తాజాగా రాయచోటి నియోజక వర్గంలోని సంబేపల్లె పర్యటన సందర్భంగా సీఎం హోదాలో కొత్త విద్యాసంస్థలు, రాయచోటి నీటికష్టాలకు పరిష్కారంను ప్రకటిస్తారని ఆశించిన ప్రజలకు చంద్రబాబు తీవ్ర నిరాశను మిగిల్చారని అన్నారు.ఇతరులు చేసిందంతా తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడం అని అందరికీ తెలుసు. ఈ దేశంలో ఐటీకి తానే మూలపురుషుడుగా, హైదరాబాద్ కు ఐటీని పరిచయం చేసిన విజనరీగా తనను తాను సిగ్గు లేకుండా పరిచయం చేసుకోవడం ఒక్క చంద్రబాబుకే చెల్లుతుందని,అదే సమయంలో బెంగుళూరు ఎందుకు ముందుకు పోయిందన్నారు. వాస్తవానికి వైయస్ రాజశేఖరరెడ్డి గారు సీఎం అయిన తరువాత హైదరాబాద్ లో ఐటీ రంగం బెంగుళూరుకు సమాంతరంగా గణనీయమైన ఆదాయాన్ని సాధించిందన్నారు .చంద్రబాబు హయాంలో కన్నా వైఎస్ఆర్ హయాంలో మూడింతలు ఐటి రంగం అభివృద్ధి చెందిందన్నారు.కానీ చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేలా తానే ఐటీని కనిపెట్టినట్లు చెప్పుకుంటున్నాడు. చివరికి హైదరాబాద్ ను సైతం తానే అభివృద్ధి చేసినట్లు చెప్పా
ఐటీ ఉద్యోగులను పక్కన పెట్టుకుని సంబేపల్లె లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు స్ఫూర్తిదాయకంగా మాట్లాడతారని అందరూ ఆశించారు.కానీ చంద్రబాబు చెంత ఉన్న ఐటీ ఉద్యోగులు 'మేం తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డాం, మేం సంపాధించినది పార్టీ కోసం ఖర్చు చేశాం, ఎన్నికల్లో పార్టీ ఏజెంట్లుగా కూర్చున్నాం, గ్రామాల్లో మేమే పార్టీ బాధ్యత తీసుకున్నాం' చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఈ ప్రాంతానికి సీఎం వచ్చినప్పుడు ఆయన సమక్షంలో ఒక ఐటీ ఉద్యోగి మాట్లాడే అవకాశం లభించినప్పుడు యువతకు స్ఫూర్తిదాయకమైన మాటలు చెబుతారని అందరూ భావించారు. కానీ దానిని కూడా పార్టీ ప్రచారానికి వాడుకోవడం విడ్డూరంగా ఉంది. దానికి తగినట్లుగా చంద్రబాబు మండల స్థాయిలోనే ఐటీ టవర్స్ నిర్మిస్తాను, వర్క్ ఫ్రం హోంను కూడా తానే కనిపెట్టినట్లు చంద్రబాబు చెప్పే మాటలు వింటే మరింత ఆశ్చర్యం కలిగించింది. వైయస్ జగన్ హయాంలో రాయచోటి ప్రజలకు నీటి కష్టాలు తప్పించేందుకు శ్రీశైలం రిజర్వాయర్ లో నీరు తగ్గిపోయినా కూడా ప్రత్యామ్నాయంగా గండికోటలో నిల్వ చేసిన నీటిని వాడుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా అనంతపురం జిల్లా దాటి నీళ్లు రావు కాబట్టి గండికోట నుంచి వెలిగల్లుకు అనుసంధానం చేసే ప్రక్రియను అమలుచేసామన్నారు.కాలేటివాగును ఒక టీఎంసీకి అభివద్ధి చేసి, అక్కడి నుంచి వెలిగల్లుకు నీటిని పంపించేందుకు వీలుగా పనులకు శ్రీకారం చుట్టాం. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వంలోనే డెబ్బై శాతం పనులు కూడా పూర్తి చేశాం. దాని మిగిలిన పనులను పూర్తి చేస్తామని చంద్రబాబు తన పర్యటనలో ఒక్క మాట కూడా చెప్పలేదు.రాయచోటి ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఒక్క విద్యాసంస్థను కూడా ప్రకటించలేదు. మహిళా జూనియర్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ, రెండో ఇంజనీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ లను వైయస్ఆర్, వైయస్ జగన్ హయాంలో సాధించుకున్నాం.రాయచోటిలో పీజీ కేంద్రం, తద్వారా యూనివర్సిటీ ఏర్పాటు కొరకు 100 ఎకరాలు భూమిని కూడా సేకరించి సిద్దంగా ఉంచామన్నారు. మదనపల్లెలో మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించ వద్దని, యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని అరెస్టు చేసారన్నారు. కొత్త కలెక్టరేట్ భవనాలు, గండికోట నుంచి నీటని అందించే ప్రాజెక్ట్ వంటి వాటిపై చంద్రబాబు మాట్లాడతారని అందరూ అనుకున్నారు. కానీ ఎప్పటిలాగానే చంద్రబాబు తన నిజస్వరూపాన్ని చాటుకున్నారు. ఈ ప్రాంత ప్రజలను మోసగించారు. మభ్యపెట్టే మాటలతో ప్రజలను వంచించారు. కర్నూలులో శాశ్వత హైకోర్ట్ కావాలంటే, దానికి బదులుగా బెంచ్ తో సరిపెట్టారు. కొప్పర్తి పారిశ్రామికవాడను ఆనాడు వైయస్ఆర్, ఆ తరువాత వైయస్ జగన్ ప్రత్యేక సెజ్ గా అభివద్ధి చేశారు. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు చంద్రబాబు చొరవ చూపాలి. చేసింది చెప్పాలే కానీ జరిగిందంతా తానే చేసినట్లు చెప్పుకోవడం సరికాదు.సీఎంగా వైయస్ జగన్ గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులు చేసుకోవాలనే ఆలోచనతో గ్రామ స్థాయిలో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దానిని కొనసాగించకుండా చంద్రబాబు ఆ నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇప్పుడు మండల స్థాయిలో ఐటీ టవర్స్ నిర్మిస్తానని చెప్పడం చంద్రబాబు రెండు నాలుకల దోరణికి, ద్వంద వైఖరికి నిదర్శనం.సంపద సృష్టించడం గురించి ప్రజలకు చెప్పడం కాదు, వారు సంపద సృష్టించుకునేలా ప్రభుత్వం పని చేయాలి. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకోవాలి. కరోనా సమయంలో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారిని ముఖ్యమంత్రిగా ఆదుకున్నది వైయస్ జగన్ . ఈ రోజు అన్ని అవకాశాలు ఉన్నా, కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఈ ఎనిమిది నెలల్లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కోటిన్నర మందికి పైగా అర్హులైన మహిళలు చంద్రబాబు ఇచ్చిన హామీని ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నిస్తున్నారు. యాభై ఏళ్ళు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్ ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఈ ఏడాది రైతుభరోసా ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు.చంద్రబాబు ఏనాడూ తన హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్లు సీఎంగా ఉన్నా, ఆయన ఏ ప్రాజెక్టూ చేపట్టలేదు. హంద్రీనీవా, గాలేరు%-%నగరి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శంకుస్థాపన చేస్తే, తరువాత దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా ఆ ప్రాజెక్టులు వృథా అని మాట్లాడారు. హంద్రీనీవా నుంచి 40 టీఎంసీలు రావు. కేవలం 5 టీఎంసీల నీరే వస్తాయని ఏకంగా జీఓ ఇచ్చారు. అలాగే గండికోటను 20 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు కుదించి జీఓ ఇచ్చారు. డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి గారు సీఎం అయిన తరువాత జలయజ్ఞంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ ను అయిదేళ్ళలో అడివిపల్లి వరకు 90 శాతం కాలువ పనులు పూర్తి చేశారు. 27 టీఎంసీల సామర్థ్యంతో కూడిన గండికోట ప్రాజెక్ట్, దానిలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన ఘనత వైయస్ జగన్ గారిది. చంద్రబాబు పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా కృష్ణా బ్యారేజీ వద్ద టీడీపీ వారితో ధర్నాలు చేయించారు.ఆనాడు వైయస్ రాజశేఖరరెడ్డిగారి పుణ్యం వల్లే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు నీరు అందుతోంది. ఏడు నెలలు ఇన్ ఫ్లో ఉన్న కృష్ణానదిలో ఈ రోజు డెడ్ స్టోరేజీ స్థాయికి నీటిని తోడేశారు. రాయలసీమకు ఎలా నీరు ఇస్తారో చంద్రబాబు చెప్పాలి. గతంలో పట్టిసీమ నుంచి రాయలసీమకు నీరు ఇస్తానంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఎలా ఇస్తారో చెప్పండి అంటే దానిపై మాట్లాడరు.ఇప్పుడు కొత్తగా బనకచర్ల
అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. బనకచర్ల క్రాస్ నుంచి సరైన అవగాహన చంద్రబాబుకు లేదు. దీనిని ఎలా పూర్తి చేస్తారో చంద్రబాబు చెప్పగలరా? రాష్ట్ర ప్రజలకు కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు కుదిస్తున్నా చంద్రబాబు మాట్లడటం లేదు. పోలవరం నుంచి కృష్ణా బ్యారేజీకి, అక్కడి నుంచి ప్రకాశం జిల్లాకు, అక్కడి నుంచి వెలుగొండ ద్వారా బనకచర్ల క్రాస్ కు నీటిని తరలిస్తారో సరైన ప్రణాళిక ఉందా? అని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు.గండికోట నుంచి మనకు కాలేటి వాగు ద్వారా వెలిగల్లు కు కలపడం ద్వారా గాలేరు నగరి నుంచి వచ్చేది సులభమవుతుందన్నారు. అనంతపురం జిల్లా నుంచి వచ్చే పరిస్థితి లేదు కాబట్టి అది చేస్తేనే ఉపయోగ కరమన్నారు.వెలిగల్లు నుంచి లిఫ్ట్ కు, మిట్ట చెరువులకు, కాలేటి వాగు ద్వారా లక్కిరెడ్డిపల్లె, రామాపురం లకు ,దీర్ఘ ప్రణాళికలు చేసి ముందడుగు వేశామని కరోనా వల్ల పనులు ఆలశ్యమయ్యాయన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాతనే వెలిగల్లు, శ్రీనివాసపురం, జరికోన ప్రాజెక్ట్ లకు రూపకల్పన జరిగి పూర్తయ్యే అవకాశం కల్గిందన్నారు.వైఎస్ఆర్ పెట్టిన ఫీజు రీయంబర్స్ మెంట్ తోనే పేదలు ఇంజనీరింగ్,ఎం బిఎ,ఎం సి ఏ లు చదవగలిగారన్నారు.జగన్ హయాంలో 17 మెడికల్ కళాశాలలు కడితే. .ప్రయివేట్ పరం చేయాలన్న ఉద్దేశ్యంతో ఎం సి ఐ ఇచ్చిన మెడికల్ సీట్లను మీరు వద్దన్నారన్నారు. కేంద్ర బడ్జెట్ లో ప్రతి సంవత్సరం 75 వేల మెడికల్ సీట్లు ఇస్తామని ప్రకటించారని, మీరు అప్పుడు మెడికల్ కాలేజీలను టెక్ అప్ చేసి ఉండి ఉంటే ఇప్పుడు మెడికల్ కళాశాలలకు మంచి జరిగివుండేది కదా అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.
సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

## ఇది ముమ్మాటికీ ప్రజల బడ్జెట్.

ఉదయం న్యూస్



నూతన ఆదాయపు పన్ను విధానం 2025 బడ్జెట్ లో ఒక మైలు రాయి మద్దిరాల విష్ణు వర్ధన్ రెడ్డి హై కోర్ట్ అడ్వకేట్ కేంద్రం ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025 సంవత్సరానికి గాని ప్రవేశ పెట్టిన బడ్జెట్, అన్ని వర్గాల ఆదాయం పన్ను కట్టే వారికి సంతోషాన్నిచే, ఆదాయం పెంచేది గా యుంది,
ఇప్పటివరకు వున్న ఆదాయపు పన్ను విధానం తో పోల్చుతే ఎన్నో రెట్లు గొప్పది, ఇది ఎవరు ఊహించనిది, నూతన ఆదాయపు పన్ను విధానం ప్రకారం 12,00, 000/- ఆదాయం వున్న జీరో ఇన్కమ్ టాక్స్ ఈ విధానాన్ని స్వాగతి స్తున్నాం.ఏది ఏమైనా ఇది ముమ్మాటికీ ప్రజల బడ్జెట్ ?

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు..!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుందిపార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, డాక్టర్ సంజయ్ కుమార్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.
బీఆర్ఎస్ పార్టీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత రెండో పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది.
పార్టీ ఫిరాయించిన ఏడుగురు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం తెలిసిందే.
పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని వేసిన మొదటి పిటిషన్‌తో పాటు రెండో పిటిషన్‌ను విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది.
ఫిబ్రవరి 10న మొదటి పిటిషన్ విచారణతో పాటు రెండో పిటిషన్‌పై విచారణ చేస్తామని తాజా పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# తెలుగు గంగ కేసీ కెనాల్ రైతులందరి తరపున సీఎం చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు

ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ...



నంద్యాల పట్టణంలోని తెలుగు గంగ ఆఫీసులో నూతనంగా తెలుగు గంగ ప్రాజెక్ట్ చైర్మన్ గా నియమితుడైన సంజీవ్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు నూతన ఆఫీస్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు... అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు మీడియాతో మాట్లాడుతూ తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ గా ఎన్నికైన సంజీవ్ కుమార్ కి అభినందనలు తెలియజేసి రైతులందరూ చైర్మన్ కి సహకరించాలని తెలిపారు...తెలుగు గంగ కేసీ కెనాల్ రైతులందరి తరపున సీఎం చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము ఆళ్లగడ్డ ఆయకట్టు 60 వేల ఎకరాల ఉంది ఇంకా పెంచుకునే అవకాశం కూడా చాలా ఉంది కళ్ళముందే నీరు వెళ్తున్న రైతులు వాడుకోలేని దుస్థితిలో చాలా సార్లు గత ప్రభుత్వంలో నేను రైతుల కోసం పోరాటం జరిగింది...తెలుగు గంగ రావడానికి కారణమైన ముఖ్య కారకుడు ఎన్టీ రామారావు గారికి ధన్యవాదాలు తెలియజేయాల ఎందుకంటే మా ప్రాంతంలో ఈ తెలుగంగ రాకుంటే అలాగే ఫ్యాక్షన్ లోనే ఉండేవారు ఈరోజు తెలుగు వల్ల అందరూ రైతులాగా మారి సంతోషంగా ఉన్నారు..తెలుగు గంగ కింద ఉన్న రైతులందరికీ. డీసీలు డైరెక్టర్లు చైర్మన్ తెలుగంగ సంబంధించిన అధికారులు కానీ ప్రతి ఒక్కరూ రైతులకు సహకరించి వాళ్లకు అందుబాటులో ఉండాలని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు...గత ఐదు సంవత్సరాలు రైతులను పట్టించుకునే నాధుడే లేడు రైతు చనిపోయిన కూడా ఏ రోజు రైతులకు ఇబ్బందుల గురించి హాలో పట్టించుకోని వైసిపి ప్రభుత్వం

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం



## శాశ్వత అన్న ప్రసాద పథకానికి విరాళం

**ఉదయం న్యూస్ రాజు శ్రీశైలం**



శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం గా సి. చైతన్య, వికరాబాద్ వారు రూ. 1,00,116 /-లను అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి

## డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ DSF విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు వినతి పత్రం

**కర్నూలు జిల్లా( ఉదయం న్యూస్)**



సోమవారం:- DSF జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ రాజు మాట్లాడుతూ..... ఆదోనిలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూన్నా శ్రీనివాసులు సారు పై 2024 సంవత్సరంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రముతో టీచర్ ఉద్యోగం చేస్తున్నావు అని విద్యాధికారులు విచారణ కమిటీ ద్వారా విచారణ జరిపి ఇందులో నుండి శాశ్వతంగా తొలగించడం జరిగింది. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సార్ గారికి తెలియజేయడం ఏమనగా ప్రభుత్వ నియమ నిబంధనాలను తుంగలో తొక్కి ప్రభుత్వ అధికారులను ప్రభుత్వమును తప్పుదోవ పట్టించి ఉద్యోగం తీసుకుని ప్రభుత్వము నుండి తీసుకున్న జీతమును తక్షణమే విద్య అధికారులు ప్రభుత్వం ఎప్పటినుండి ఉద్యోగం చేసి తొలగించారో అప్పటివరకు ప్రభుత్వం నుండి డబ్బులను తక్షణమే రికవరీ చేయాలి. లేనియెడల ఇలాంటి వాళ్లను చూసి చాలామంది తయారవుతారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు విచారణ చేసి శ్రీనివాసులు నుండి జీతం వెనక్కి ప్రభుత్వ నియమా నిబంధనాలను కాపాడాలని విద్యార్థి సంఘంగా గ్రీవెన్స్ లో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సార్ గారికి వింత పత్రం ఇవ్వడం జరిగింది. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ MEO ను ఈ విషయంపై తక్షణమే విచారణ చేసి నాకు తెలియజేయాలి అని మాట్లాడటం జరిగింది . ఈ సమావేశంలో DSF నాయలుకు మహేష్ భాస్కర్ బడేసావలి విక్రమ్ కిరణ్ పాల్గొన్నారు.

## మెనూ పాటించని,నాసిరక నిత్యవసరల సరుకులతో భోజనం చేస్తున్న ఏజెన్సీ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి,తక్షణమే వంట ఏజెన్సీ ను తొలగించాలి: ఏఐఎస్ఎఫ్

**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**



ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని ప్రభుత్వ బాలికల హై స్కూల్ లో మధ్యాహ్నం భోజన పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీ మెనూ పాటించకుండా, నాసిరకంగా నిత్యవసర సరుకులతో విద్యార్థినీలకు భోజనాలు తయారు చేస్తున్నారని కాబట్టి తక్షణమే ఏజెన్సీ పై క్రిమినల్ కేసు నమోదు చేసి, ఏజెన్సీని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు విష్ణు,ఏఐఎస్ఎఫ్ తాలూకా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక పట్టణంలో మాచాని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద వంట ఏజెన్సీ మారిచి అధికార పార్టీ కి వారికి అప్పగిస్తే వారు విద్యార్థుల కడపులు మాడ్చి ప్రభుత్వం ప్రకటించిన మెనూ ద్వారా విద్యార్థినిలకు భోజనాలు పెట్టకుండా,ఏజెన్సీ సొంతంగా తయారు చేసిన మెనూ ద్వారా మధ్యాహ్నం భోజనాన్ని వండించడం జరుగుతుందని, అది కూడా నాణ్యత లేనటువంటి సరుకులతో తయారు చేయడం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ సొంత మెనూ ద్వారా భోజనాలు తయారుచేయడం ఏమిటని ప్రశ్నిస్తే, మధ్యాహ్నం భోజనం పథక ఏజెంట్స్ అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తి నీ అక్కడ ఉన్నవారు చెప్పడం జరిగింది. ఈ నాసిరక భోజనాలు తింటే విద్యార్థినీలు అనారోగ్యం పాలు అవుతారు అని కాబట్టి సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే మేల్కొని ఈ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీని తొలగించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారిచరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకుల శ్రీను, రాఘవేంద్ర, నాయుడు, అంజి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పాతపేట హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు

**డోన్ ఉదయం న్యూస్ ప్రతినిధి**




పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన నేడు సరస్వతి మాత పుట్టిన రోజు సందర్భంగా వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల సమక్షంలో సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల సమర్పించి సరస్వతీ దేవి శ్లోకమును తెలుగు ఉపాధ్యాయులు రాధ, భాను ప్రకాష్ రెడ్డి పలికించారు. రఘునాథ్ గారు మాట్లాడుతూ సరస్వతి మాత గొప్పతనాన్ని తెలియజేసి, సరస్వతీ దేవి జ్ఞానప్రసాదిని అన్నారు. మనం ఎంతో వివేకంతో విచక్షణతో జీవించాలని, ఎంత సంపాదించినా, విద్య తోనే వివేకం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని , తద్వారా లక్ష్య సాధన సులభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకట లక్ష్మీ, శ్రీనివాసులు, అల్లిపీరా, ఎస్తేరమ్మ, లక్ష్మి కాంత రెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధు సూధన్ రెడ్డి, విజయ కుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బ రాయుడు, శివన్న, బాబు, ఆది నారాయణ, సురేష్, రమేష్, దేవేంద్రప్ప, భారతి, లక్ష్మి ప్రభావతి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ను బాధ్యతగా నిషేధించాలి .. సిఐ నాగరాజు

**భీమవరం : ఉదయం న్యూస్ :**



మనుషులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదని, ప్లాస్టిక్ కు విపరీతంగా వినియోగించడం వల్ల క్యాన్సర్ వ్యాధి ప్రభలుతోందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ను బాధ్యతగా నిషేధించాలని భీమవరం ఒన్ టౌన్ సిఐ నాగరాజు అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఒన్ టౌన్ పోలీసు స్టేషన్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ సాధారణ వ్యాధులు కన్నా తెచ్చి పెట్టుకున్న వ్యాధులు ప్రాణాలు తీస్తాయని, ఇవన్నీ తెలిసి కూడా ప్లాస్టిక్ ను వినియోగించడం సరి కాదన్నారు. ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్య పథంలో ఉంటుందని, ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి ఆరోగ్య సమాజాన్ని చూడాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు వేంద్ర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు ప్లాస్టిక్ అనర్ధాలపై వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్లాస్టిక్ రహిత సమాజ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఒన్ టౌన్ పోలీసు స్టేషన్ కు స్టీల్ గ్లాసులు, ప్లేట్స్ అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఆనంద్, జి సుబ్బయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా సంజామల మండలం, చీమల తిప్ప గ్రామంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టి

**నంద్యాల జిల్లా ఉదయం న్యూస్ :**



నంద్యాల జిల్లా, సంజామల మండలం, చీమల తిప్ప గ్రామాన్ని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ బృందంతో పరిశీలించగా, గ్రామ ప్రజలు కనీస వసతులు లేక దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. రోడ్లు, ఇళ్లు, పబ్లిక్ టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఆధార్ సమస్యలు, రేషన్ కార్డు సమస్యలు వంటి ప్రాథమిక అవసరాలు అందుబాటులో లేవు. మరింత తీవ్రమైన సమస్యగా, గ్రామంలో స్మశానం లేకపోవడం వల్ల, మరణించిన వారి అంత్యక్రియలు నిర్వహించడంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి పరిస్థితి ఎంతో బాధాకరం. కావున, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి, తక్షణ చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నాము. ముఖ్యంగా, గ్రామానికి గుడిని, ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు, పబ్లిక్ టాయిలెట్లు వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ ఇంచార్జ్ డాక్టర్ ఎన్.ఎం.డి. ఫయాజ్, లీగల్ అడ్వైజర్ బాల హాజీ, ప్రేమ్ రాజ్, సత్యం సింగ్, ముషాహిద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## సంగీతం, కళలకు దేవత సరస్వతీ దేవి

**సర్ సివి రామన్ స్కూల్లో సరస్వతి దేవి పూజలు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు**

**భీమవరం : ఉదయం న్యూస్ :**



వసంత పంచమి పవిత్రమైన రోజున సంగీతం, కళలకు దేవత అయిన సరస్వతీ దేవిని ప్రత్యేకంగా పూజిస్తారని, ఈ పవిత్రమైన రోజే సరస్వతీ దేవి జన్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుందని పురోహిత పండిత్ వేలూరి కిరణ్ శర్మ అన్నారు. వసంత పంచమి సందర్భంగా సర్ సివి రామన్ స్కూల్లో విద్యార్థులచే సరస్వతి పూజలు, సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సరస్వతీ దేవిని పూజించిన వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం వల్ల వారు త్వరగా పురోగమిస్తారని, ఇంట్లో కూడా సానుకూల శక్తి ప్రవాహం పెరుగుతుందని, మనసు ఏకాగ్రతతో ఉంటుందని అన్నారు. ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత మాట్లాడుతూ 14 మంది విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించామని, 110 మంది విద్యార్థులచే సరస్వతి పూజ నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే పార్వతి, వరలక్ష్మి, శైలజ, దేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికలకు సిద్ధం అంటున్న కేటీఆర్:

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



తెలంగాణలో ఉప ఎన్నికలు జరగనున్నాయా ఈ దిశగా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రకటన ఏమైనా వచ్చిందా అలాంటిదేమీ లేకున్నా, బీఆర్ఎస్ శ్రేణులు ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సోమవారం మధ్యాహ్నం ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కు ఆయన సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కామెంట్లను ట్యాగ్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది.
తన ట్వీట్ లో కేటీఆర్ ఏమన్నారంటే.. పార్టీ ఫిరాయింపు దారులను కాంగ్రెస్ పార్టీ ఇక ఎంతమాత్రం కాపాడుకోలేదు. చట్టాన్ని గుర్తు చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఉప ఎన్నికలు ఇక తథ్యమేనని తేలిపోయింది. వాటికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ టికెట్లపై ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో దాదాపుగా 10 మంది ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే.
తమ పార్టీ గుర్తులపై పోటీ చేసి ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన వారి సభ్యత్వాలను రద్దు చేయాలని బీఆర్ఎస్ అసెంబ్లీ స్పీకర్ ను కోరింది స్పీకర్ కార్యాలయం నుంచి ఆశించిన మేర స్పందన కనిపించలేదు.

## సుంకాలపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్

న్యూఢిల్లీ: సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్నారు. ట్రంప్ చర్యలతో వచ్చే నష్టమేమీ లేదని, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ భరోసాగా ఉన్నారు. ముందునుంచి హెచ్చరిస్తున్నట్టుగానే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెక్సికో, కెనడా, చైనా పైనా సుంకాల కొరడా ఝుళిపించారు. అలాగే ఇప్పటికే పలుమార్లు భారత్‌ను టారిఫ్ కింగ్ అని విమర్శించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారత్ ఆందోళన చెందుతుందా..? అని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కు ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె బదులిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ‘దీనిపై ఎలాంటి ఆందోళన చెందడం లేదు. భారత్ తయారీ కేంద్రంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం. మా సేవల రంగంలో బలంగా ఉన్నాం. సాఫ్ట్‌వేర్, ఏఐ, స్టెమ్ ఆధారిత పరిశోధనల పరంగా భారత్ స్వదేశీ సామర్థ్యం కలిగిఉంది. మన బలాలేంటో మనకు తెలుసు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉంది. భారత్‌లో అందుబాటులో లేని కొన్ని ఉత్పత్తులను మనం దిగుమతి చేసుకోవాలి. అలాంటి వాటిపై అధిక సుంకం విధించి, భారత్‌లోకి రాకుండా ఆపడం వల్ల ఏ ప్రయోజనం లేదు. ఉత్పత్తి, తయారీ, ఎంఎస్ఎంఈలకు సంబంధించి భారత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉంది‘ అని మంత్రి వెల్లడించారు. ట్రంప్ వాణిజ్య యుద్ధ ప్రభావం భారత్‌పై ఎలా ఉండనుంది..? అనే ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ‘ఆ టారిఫ్‌ల ప్రభావం పరోక్షంగా మనపైనా ఉండొచ్చు. అయితే అది ఏ స్థాయిలో ఉండనుందనేది ప్రస్తుతానికి అంచనా వేయలేం. మేం మాత్రం అత్యంత అప్రమత్తతతో పరిస్థితులను గమనిస్తున్నాం‘ అని తెలిపారు. దీర్ఘకాలిక మిత్రదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25? చొప్పున, చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10? సుంకం విధిస్తూ తాజాగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. తాము చేసిన సాయానికి ప్రతిఫలం ఇదా అని కెనడా వాపోగా, తాజా పరిణామాల వేళ తాము తలవంచబోమని మెక్సికో తేల్చిచెప్పింది. ట్రంప్ చర్యలపై మండిపడిన చైనా.. డబ్ల్యూటీవోలో సవాలు చేస్తామని ప్రకటించింది. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారీ బెదిరించకుండా, ఫెంటానిల్ లాంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలని అమెరికాకు చైనా హితవు పలికింది.

## కేసీఆర్‌కు లీగల్ నోటీసులు..?

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



తెలంగాణ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు బిగ్ షాక్ తగిలింది అసెంబ్లీకి గైర్హాజరు అవుతున్న కేసీఆర్ కు ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ఇన్ తెలంగాణ లీగల్ నోటీసులు పంపింది. అపోజిషన్ లీడర్ గా తన కర్తవ్యాన్ని నిర్వర్తించని ఆయనకు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని నోటీసులో పేర్కొన్నారు. అసెంబ్లీకి హాజరు కాని కెసిఆర్ పై అనర్హత వేటు వేయాలని ఫార్మర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ కోరారు.



## జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి శుభవార్త..!

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

తెలంగాణలోని అర్హులైన ప్రతీ జర్నలిస్టుకి ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇళ్ల స్థలం మంజూరు చేయించడం జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను తమ ప్రభుత్వంలో పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం జర్నలిస్టు ఇండ్ల సొసైటీ సమస్య సుప్రీం కోర్టు పరిధిలో ఉందని. అయినప్పటికీ అతి త్వరలోనే వారి సమస్యకు పరిష్కారం చూపిస్తామని మంత్రి భరోసానిచ్చారు.

# వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్‌తో బాటలు

**ఏపీకి ఆక్సిజన్ అందించేలా బడ్జెట్ కేటాయింపులు ఇప్పుడే నిలదొక్కుకుంటున్నాం..., 15% వృద్ధి రేటు లక్ష్యం ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే... అదే మైనస్ పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి% బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం**

**న్యూఢిల్లీ,:** ఉదయంన్యూస్



'వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు చూస్తే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన ఆక్సిజన్‌లా ఉంది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడారు. 2025-26 బడ్జెట్, ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని వివరించారు. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఏపీకి మేలు చేసేలా కేంద్ర బడ్జెట్**

ఏపీకి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి వినూత్నమైన పాలసీలతో మోదీ ప్రభుత్వం ముందుకెళుతోంది. దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్ అని తెలుగుకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని బడ్జెట్ తొలి వ్యాఖ్యల్లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు కేటాయించబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్ లో రూ. 5,936 కోట్లు కేటాయించింది. విశాఖ స్టీల్ ను ఆదుకునేందుకు బడ్జెట్ కు ముందే కేంద్రం రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ బడ్జెట్ లో రూ. 3,295 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, విశాఖ-చెన్నై కారిడార్ కు రూ.285 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు ప్రకటించారు.

**ఏపీ అభివృద్ధే లక్ష్యం, విమర్శలు పట్టించుకోం**

గత విధ్వంస పాలనతో అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కుపోయింది. విభజనతోనే కాదు... గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ దెబ్బతింది. సంపద దోచుకునేవాళ్లు కాదు... పంచేవాళ్లు కావాలి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాము. 7 నెలల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 15 % వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకెళుతున్నాము. దావోస్ పర్యటన విజయవంతమైంది. పలు అంతర్జాతీయ పరిశ్రమలు ఏపీకి రాబోతున్నాయి. ఉద్యో, ఉపాధి కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. అభివృద్ధి , సంక్షేమం రెండూ సమానంగా ప్రజలకు అందిస్తున్నాము. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, అగ్రికల్చర్, జీరో పావర్టీ, ఎంఎస్‌ఎంఈల విషయంలో కేంద్రం ఆలోచనలకు తగ్గట్టు ఏపీ అనుసరిస్తోంది. కొందరు రాజకీయ లబ్ధి కోసం బడ్జెట్‌లో ఏపీకి చేసిన కేటాయింపులపై విమర్శలు చేస్తున్నారు. బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావనపై మాట్లాడుతున్నారు. కేంద్రం మన రాష్ట్రానికి నిధులు కేటాయించి ఆదుకోవడం ముఖ్యం కానీ ప్రతిసారీ పేరు చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్రం ఇచ్చే చేయూతతో దేశంలోనే ఏపీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం.

**ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం**

ఢిల్లీ మన రాజధాని. మనందరి ఆత్మ గౌరవం. మన దేశానికి వచ్చే విదేశీయులు ముందుగా వచ్చేది ఢిల్లీకే.

గత పదేళ్లుగా పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రపంచంలోనే అత్యధిక వెదర్ పొల్యూషన్, పొలిటికల్ పొల్యూషన్ ఢిల్లీలోనే ఉంది. చేసిన పనులు ఫలితాలు ఇవ్వకపోవడంతో కేజ్రీవాల్ ఏవేవో చెప్పి ప్రజల్ని పొల్యూట్ చేయాలని చూస్తున్నారు. ఢిల్లీ గల్లీల్లో మురికినీరు, మంచినీరు కలిసిపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. యమునా నది మొత్తంగా కలుషితమైంది. వాయు కాలుష్యం అయితే భరించలేని స్థితిలో ఉంది. ఢిల్లీకి ఎవరూ వచ్చేందుకు ఇష్టపడటం లేదు. బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం కనుక ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు.



## అబాకస్ లో ప్రతిభ చాటిన అజీమ్ బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు

**ఉదయం న్యూస్ చాగలమర్రి**

విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో కడప జోనల్ స్థాయిలో హజరత్ ఆయేషా గర్ల్స్ స్కూల్ లో నిర్వహించిన అబాకస్ ప్రతిభా పోటీలలో చాగలమర్రి అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల నుండి పాల్గొన్న విద్యార్థుల్లో 3 వ తరగతికి చెందిన అర్షద్ కు జూనియర్ లెవెల్-1 కేటగిరీలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని జోనల్ స్థాయిలో గుర్తింపు పొందారు. పాఠశాల కరస్పాండెంట్ అన్సర్ భాష విద్యార్థులను, అబాకస్ చెప్పిన అరుణ జ్యోతి మేడమ్ ను అభినందించారు. అదే విధంగా ఈ ప్రతిభా పోటీలో పాల్గొనటానికి ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ప్రశంసించడం జరిగింది.

# అభివృద్ధి దిశగా అడుగులు

**బ్రాహ్మణకొట్కూర్ ఉదయం న్యూస్**



అసమర్థ పాలకుల నియంతృత్వ మూర?పు చర్యలతో గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అరాచకంతో అప్పుల పాలయింది. రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా విధ్వంస ఆంధ్రప్రదేశ్ మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అలంబలనయ్యే పోలవరం, అమరావతి, రాజధాని నగరం పరుగులు తీయించడం సీఎం. చంద్రబాబు దీక్ష దక్షతలకు అద్దం పడుతున్నది. ఏపీ బ్రాండ్ ఇమేజ్ను తిరిగి తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించింది. కొత్త ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుతో, రాష్ట్రాలలో గణనీయమైన పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఆరు నెలలలో 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు పెట్టుబడులలో వచ్చాయి. కేంద్రం నుంచి అమరావతికి రూ 15 వేల కోట్లు, పోలవరానికి 12,500 కోట్లు, సాధించడం విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించడం వంటివి రాష్ట్ర అభివృద్ధికి మేలు చేస్తాయని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూర్ గ్రామం తెలుగుదేశం నాయకుడు మిలిటరీ సురేష్ అభిప్రాయ పడ్డారు. అలాగే రూ 55 వేల కోట్లు విలువైన జాతీయ రహదారులు రెండున్నర ఏళ్లలో పూర్తి చేయడానికి కేంద్రం అనుమతి సాధించడం,రూ 70 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు సాధించడం వంటి చక్కటి ప్రణాళికతో రాష్ట్రానికి అభివృద్ధి బాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతున్నది. కూటమి పాలనలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తుందని తెలుగుదేశం నాయకుడు మిలిటరీ సురేష్ ఆనందం వ్యక్తం చేశారు.

## ఈ నెల 4 వ తేదీ న ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహణ

**ఉదయం న్యూస్ చాగలమర్రి**




చాగలమర్రి ముత్యాలపాడు బస్టాండ్ న్యూ రామకృష్ణ మెడికల్ స్టోర్ నందు ఈనెల నాలుగవ తేదీ మంగళవారం రోజు కడప హిమాలయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నుంచి ప్రముఖ కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్ చే ఉచితంగా మెడికల్ క్యాంపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్లు,తుంటి కీళ్ల మార్పిడి ఆపరేషన్లు, విరిగిన ఎముకలు,కీ హోల్ ఆపరేషన్లు, భుజాలలో నరం తెగడం, మోకాలు చిప్ప ఎముక విరగడం, మోకాలిలో నరం తెగడం వంటి వాటికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామన్నారు. 1500/- విలువ గల బి ఎం డి పరీక్ష (ఎముకల బలము పరీక్ష ) ఉచితంగా చేయబడుతుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ మెడికల్ క్యాంపుకు అవసరమైన వారు 9542173214 నెంబర్ కి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేయడం జరిగింది.

## మున్సిపాలిటీ పరిధిలోని 70కి పైగా సర్వే నెంబర్లలోని ఆక్రమిత పబ్లిక్ పర్పస్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి-

**ఆక్రమణకు గురైన పబ్లిక్ పర్పస్ స్థలాలు, రస్తాలను స్వాధీనం చేసుకుని అధికారులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి**

**- సిపిఐ ఎంఎల్ బరేషన్ పార్టీ**

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణకు గురైన సుమారు 70 సర్వే నెంబర్లలోని పబ్లిక్ పర్పస్ స్థలాలను, రస్తాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఎంఎల్ లిబరేషన్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బద్వేల్ మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, పూట గడవని పేదవాడు తాను సంపాదించుకున్న మొత్తంలో కొద్దిగా మిగులుచుకుని కూడగట్టుకున్న సొమ్ముతో పాటు చిన్నపాటి స్థలం కొనుక్కొని అందులో చిన్న పాటి గూడు నిర్మించుకుంటే ఓర్వలేని కొందరి మాటలు విని తెలుసుకోకుండా ఏకపక్షంగా కూల తోయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు తమ విధులు పట్ల బద్వేలు పట్టణ అభివృద్ధి పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బద్వేల్ మండలంలోని బద్వేలు, చెన్నంపల్లి, గుంతపల్లి మరియు మడకలవారిపల్లె గ్రామ రెవెన్యూ పొలాల్లోని సుమారు 70 కి పైగా సర్వే నెంబర్లలోని అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు మరియు రస్తాలు ఆక్రమించి పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించుకుని ఉన్నారని అటువంటి వాటిని కూలదోసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తమ విధుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు ఘాటుగా విమర్శించారు. అలాగే మున్సిపల్ కార్యాలయపుకు అతి దగ్గరలో ఉన్న సర్వే నెంబర్ 950,951లలో మున్సిపల్ కమిషనర్ పేరు మీదనే ఉన్న స్థలాల్లో గుడి ఆశ్రమం పేరుతో జరుగుతున్న నిర్మాణాలను మరియు ఎన్జీవో 8 సెంట్లు ప్లాట్లలో ఆక్రమణ గిరైన అత్యంత విలువైన రస్తా స్థలాలను స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి పేదలకు ఓ న్యాయం బలవంతులకు ఓ న్యాయం అనేలా కాకుండా న్యాయం అందరికీ సమానమనేలా వ్యవహరించాలని వారు కోరారు.

## పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం.

**ఉదయం చాగలమరి న్యూస్**



చాగలమర్రి గ్రామంలో జూటూరు అనంత్ సాయి పుట్టినరోజు సందర్భంగా నగళ్ళపాడు గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూటూరు రవి కుమార్ ధర్మపత్ని పద్మజ , వల్లంకొండు సాయి సుదర్శన్ రావు , కుటుంబసభ్యులు , తదితరులు , పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేసిన మండల బిజెపి నాయకులు

**ఉదయం న్యూస్ చాగలమర్రి**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై చాగలమర్రి మండల బిజెపి అధ్యక్షులు పొన్నంపల్లి చంద్రమౌళి హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

భారతీయ జనతా పార్టీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ గారు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా ఉందని

ముఖ్యంగా రైతుల కిసాన్ క్రెడిట్ కార్డుదారుల రుణం 3 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచడం, వ్యాపారం చేసే ఎస్సీ ఎస్టీ మహిళలకు రెండు కోట్ల వరకు రుణాలు మంజూరు, మధ్యతరగతి ప్రజల ఆదాయ పన్ను పరిధిని 12 లక్షల వరకు పెంచడం, ఈ నిర్ణయం చిన్న మధ్యతరగతి ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కల్పించే అంశమని క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల కోసం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే 36 ఔషధాలపై కస్టమ్స్ సుంకం పూర్తిగా ఎత్తివేయడం, విద్యారంగానికి సంబంధించిన విద్యార్థుల కోసం 50 వేల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయడం, రానున్న ఐదు సంవత్సరాలలో 75 వేల మెడికల్ సీట్లను పెంచడం అదేవిధంగా స్థానికంగా 100 విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం అదేవిధంగా గిగి ( గిరిజన కార్మికులు)కార్మికులకు

ప్రత్యేక హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వడం, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించడం లాంటి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో శుభ పరిణామం అని ఈ బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది అని చాగలమర్రి మండల బిజెపి అధ్యక్షులు పొన్నంపల్లి చంద్రమౌళి వెల్లడించడం జరిగింది.

## సరస్వతి హెూమం కార్యక్రమం నిర్వహణ


**ఉదయం న్యూస్ చాగలమర్రి**



చాగలమర్రి గ్రామంలో శ్రీ భారతి విద్యామందిరం పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వసంత పంచమి సంధర్భంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పూజారి ప్రతాప్ శర్మ ఆధ్వర్యములో హెూమ యాగాలు నిర్వహించారు.సరస్వతి హెూమం కార్యక్రమంలో సురేంద్రనాథ్ రెడ్డి ధర్మపత్ని మౌనిక కుమార్తె పర్నిక రెడ్డి , శివా రెడ్డి ధర్మపత్ని ధరణిదేవి కుమారుడు గగన్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీ భారతి విద్యామందిరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను మండల విద్యాధికారి అనురాధ ఉపాధ్యాయులతో కలిసి ఆహ్వానించి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షర శ్రీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారుల చేత అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అనురాధ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులు నర్సరీ నుంచి విద్యాబుద్ధులు , పిల్లల నడవడిక నేర్పే పాఠశాల శ్రీ భారతి విద్యామందిరం పాఠశాల అని తెలిపారు.సహారా సోషల్ సర్వీస్ టీమ్ ఆధ్వర్యములో చిన్నారులకు ఉచితంగా పలకలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అనురాధ , పాఠశాల అధ్యక్షుడు మదళ్లపల్లె సత్యనారాయణ ,ఉపాధ్యక్షుడు మేడ ప్రభాకర్ , కార్యదర్శి ఆర్. సి.సుబ్బారావు గుప్త , జాయింట్ సెక్రటరీ సుంకు రాజేష్ , ఆచార్యులు ప్రసాద్ రావు , కాంతారావు , మాతాజీలు , విద్యార్థి తల్లిదండ్రులు , విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి అంబులెన్సులు ఇచ్చిన సోనూ సూద్

**అమరావతి, ఉదయం**



ఆరోగ్యం-సామాజిక సంక్షేమం విషయంలో సేవలు అందించే 'సూద్ చారిటీ ఫౌండేషన్' రాష్ట్రంలో ప్రజారోగ్య సంరక్షణ కోసం నాలుగు అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. నటుడు, 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూ సూద్ మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు, సుదూర ప్రాంతాల్లో క్లిష్టమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా అంబులెన్సులు ఇచ్చిన సోనూసూద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం అత్యవసర వైద్య చికిత్సలు, అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం అందేలా ఆరోగ్య సంరక్షణలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆశయంలో 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' భాగస్వామి కావడంపై ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అంబులెన్సుల ద్వారా భరోసా లభిస్తుందని సోనూసూద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీన్ రివర్స్..

**బడ్జెట్ ప్రసంగం ముగియగానే నష్టాల్లోకి మార్కెట్లు..**



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు భారీ లాభాల్లో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత కాస్త కోలుకున్నప్పటికీ ఫ్లాట్ గానే కొనసాగుతున్నాయి.

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ (ఫిబ్రవరి 1వ తేదీ)న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అయితే, ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు లాభాల్లోకి దూసుకెళ్లాయి సూచీలు. కానీ, బడ్జెట్ ప్రసంగం ప్రారంభించిన కొద్ది సేపటికే సీన్ రివర్స్ అయింది. లాభాల నుంచి నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో భారీగానే పడిపోయాయి. ఆ తర్వాత కీలక రంగాలకు ఊరట కల్పిస్తున్నట్లు ప్రకటించడంతో కాస్త కోలుకున్నప్పటికీ ఫ్లాట్‌గానే ట్రేడవుతున్నాయి. బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత కీలక రంగాల్లోని కంపెనీల స్టాక్స్ నష్టాల్లోకి జారుకున్నాయి. దీంతో సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ 38 పాయింట్ల లాభంతో 77 వేల 451 వద్ద ట్రేడవుతోంది. అయితే బడ్జెట్‌కి ముందు 250 పాయింట్లకుపైగా లాభంలో ట్రేడయి ఆ తర్వాత పడిపోయింది. ఇక మరోవైపు.. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 50 పాయింట్ల నష్టంతో 23,458 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఏకంగా 100 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 222 పాయింట్ల నష్టాల్లో ట్రేడవుతోంది.

బడ్జెట్‌లో పప్పు ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం ప్రకటించిన క్రమంలో అగ్రి స్టాక్స్ రాణించాయి. క్లీన్ టెక్ మిషన్ కింద సోలార్, ఈవీ, బ్యాటరీ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడంతో ఆయా రంగాల షేర్లు రాణించాయి. ఇన్సూరెన్స్ సెక్టార్‌లో ప్రస్తుతం ఉన్న 74 శాతం ఎఫ్‌డీఐలను 100 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించడంతో స్టార్ హెల్త్ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కానీ, బడ్జెట్ ముగిసే సమయానికి లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫిన్ సర్వ్, టెక్ మహీంద్రా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. జొమాటో, మారుతీ సుజుకీ, హెచ్‌యూఎల్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

**మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ 38 పాయింట్ల లాభంతో 77 వేల 451 వద్ద ట్రేడవుతోంది. అయితే బడ్జెట్‌కి ముందు 250 పాయింట్లకుపైగా లాభంలో ట్రేడయి ఆ తర్వాత పడిపోయింది.**

# సామాన్యులపై బడ్జెట్ ఎఫెక్ట్.. తగ్గేవి, పెరిగేవి ఇవే..

ఎన్నో అంచనాల నడుమ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదో సారి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈసారి రక్షణశాఖకు అత్యధికంగా రూ. 4.91 లక్షల కోట్ల కేటాయింపులు చేపట్టగా.. టాక్స్‌పేయర్లకు శుభవార్త అందించారు. రూ. 12 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ చెల్లించాల్సిన పని లేదని తెలిపారు. ఇంకా బడ్జెట్ ప్రకటనల తర్వాత కొన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. కొన్నింటి ధరలు తగ్గుతాయి అవేంటో చూద్దాం.

2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ కేంద్ర ప్రభుత్వం.. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే బడ్జెట్ అనేది నేరుగా ప్రజలపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే టాక్స్‌పేయర్లకు ఊరించే ప్రకటన చేశారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. రూ. 12 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ రిబేట్ 100 శాతం ఇస్తున్న నేపథ్యంలో ఎలాంటి పన్ను చెల్లించనక్కర్లేదని వెల్లడించారు. దీంతో ఇదివరకు టాక్స్ శ్లాబులతో ఇంత ఆదాయం ఉన్నవారికి కొత్త ప్రకటనతో.. రూ. 80 వేల వరకు పన్ను ఆదా అవుతుందని స్పష్టం చేశారు నిర్మలా సీతారామన్. ఇంకా పన్ను శ్లాబుల్ని



సవరించారు. అయితే.. దీనికి తోడు.. బడ్జెట్ ప్రకటనల నేపథ్యంలో.. కొన్ని వస్తువుల ధరలు తగ్గుతుంటే.. ఇంకొన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి.

ముందుగా మొబైల్ ఫోన్స్ ధరలు తగ్గుతాయి. మొబైల్ ఫోన్ బ్యాటరీ ఉత్పత్తిలో ఉపయోగించే మరో 28 రకాల వస్తువుల్ని కస్టమ్స్ సుంకాల నుంచి మినహాయింపు కల్పించారు. కోబాల్ట్ ఉత్పత్తులు, జింక్, లిథియం- అయాన్ బ్యాటరీ తుక్కు సహా 12 క్రిటికల్ మినరల్స్‌కు కస్టమ్స్ సుంకం తొలగించింది. 3 రకాల క్యాన్సర్ చికిత్స మందులను బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు కల్పించారు. దీంతో ఈ మందుల ధరలు దిగొస్తాయి. 36 రకాల ఔషధాలకు కూడా బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తొలగించింది కేంద్రం. సహా సెస్‌లు పడే 82 టారిఫ్ లైన్లపై సామాజిక సంక్షేమ సర్‌ఛార్జీ తొలగించింది. సముద్ర ఉత్పత్తులపైనా బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 35 శాతం నుంచి ఏకంగా 5 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించా రు. బడ్జెట్ తర్వాత తగ్గే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, టీవీలు, ఎలక్ట్రిక్ వెహికిల్స్, వైద్య పరికరాలు, మన దేశంలో తయారైన దుస్తులు, చేనేత వస్త్రాలు, తోలు వస్తువులు వంటివి ఉన్నాయి. సముద్ర ఉత్పత్తులు, షిప్స్ తయారీకి సంబంధించిన ముడిపదార్థాల ధరలు కూడా తగ్గుతాయి.

1600cc అంతకుమించి ఇంజిన్ కెపాసిటీ ఉన్న బైక్స్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ప్రస్తుతం ఉన్న 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. దీంతో బైక్స్ ధరలు కూడా తగ్గనున్నాయి. ఇంకా 1600cc మించని కెపాసిటీ ఉన్న మోటార్‌సైకిల్స్‌పై 50 శాతం నుంచి కస్టమ్స్ డ్యూటీని 40 శాతానికి తగ్గించారు. వీటి ధరలు కూడా తగ్గుతాయి. పెరిగే వస్తువుల జాబితా చూస్తే.. అధిక సుంకాల నేపథ్యంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల ధరలు, టెలికాం పరికరాల ధరలు పెరగనున్నాయి. సిగరెట్స్, ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లే వంటివి ఉన్నాయి. ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేపై ప్రస్తుతం 10 శాతం బేసిక్ కస్టమ్స్ సుంకం ఉండగా.. దీనిని 20 శాతానికి చేర్చింది.

# బడ్జెట్‌లో రైతులకు గుడ్‌న్యూస్..

రైతులకు పంట సాగు కోసం పెట్టుబడులు అవసరమైనప్పుడు.. బయట అధిక వడ్డీ రేట్లతో అప్పులు చేయకుండా ఉండేందుకు.. ఈ కిసాన్ క్రెడిట్ కార్డు స్కీమ్ కింద తక్కువ వడ్డీ రేట్లకే (వడ్డీ రాయితీతో) రుణాలు వస్తాయన్నమాట. వడ్డీ రేట్లలో దాదాపు 4 శాతం సబ్సిడీతో లోన్లు ఉంటాయి. భారత ప్రభుత్వం.. రైతుల కోసం ఈ కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని 1998లోనే ప్రారంభించింది. వ్యవసాయం సహా మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో స్వల్పకాలిక రుణాన్ని పొందొచ్చు. ఇక్కడ వ్యవసాయం సహా ఇతర అనుబంధ కార్యకలాపాలైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలు, కూలీల ఖర్చు, మార్కెటింగ్, పంట కోత ఖర్చులు వంటి అవసరాల కోసం ఈ కార్డు ద్వారా లోన్ తీసుకోవచ్చు. కిసాన్ క్రెడిట్ కార్డులతో బీమా సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ అంతకుముందు గరిష్టంగా రూ. 1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే లోన్ పొందొచు. ఇప్పుడు పరిమితి పెంచిన నేపథ్యంలో ఈ పరిమితి కూడా పెరిగే అవకాశం ఉంది. రైతుల కోసం ఇదే సమయంలో ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన కార్యక్రమాన్ని ప్రకటించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. దీని కింద దేశంలోని వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందనుంది. దీంట్లో భాగంగా ముందుగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన వంద జిల్లాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. అయితే పీఎం కిసాన్ స్కీమ్ నగదు పెంపు గురించి ఎలాంటి ప్రకటనా రాలేదు. దాదాపు 1.7 కోట్ల గ్రామీణ రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇక్కడ గోదాములు, నీటి పారుదల సహా రుణ సౌకర్యాల కల్పన ఉంటుంది. బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. మసూర్, కంది, మినుముల్ని కేంద్రం కొనుగోలు చేయనుంది. ఇంకా పండ్లు, కూరగాయల ఉత్పత్తికి కొత్త పథకం ప్రకటించారు. పత్తి రైతులకు మేలు చేసేలా.. దీర్ఘకాలిక లక్ష్యాలతో జాతీయ పత్తి మిషన్‌పై ప్రకటన చేశారు.

# ఆన్‌లైన్ డెలివరీ వర్కర్లకు ఆరోగ్య బీమా..




మన దేశంలో గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ, ఇతర వస్తువులు ఆన్‌లైన్ ద్వారా డెలివరీ చేసేందుకు చాలా సంస్థలు అందుబాటులోకి వస్తున్న క్రమంలో గిగ్ వర్కర్లకు డిమాండ్ పెరిగింది. తాజాగా వారికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శు భవార్త అందించారు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా గిగ్ వర్కర్ల కోసం ఆరోగ్య బీమా కల్పిస్తామని ప్రకటించారు. దీని ద్వారా దేశంలోని కోటి మందికిపైగా ఆన్‌లైన్ డెలివరీ వర్కర్లకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

'గిగ్ వర్కర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందిస్తాం. ఇ-శ్రమ్ పోర్టల్ కింద వారికి ప్రత్యేక గుర్తింపు కల్పిస్తాం. అలాగే పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా కల్పిస్తాం. దీని ద్వారా కోటి మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం కలుగుతుంది' అని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. బడ్జెట్‌లో గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే పథకం తీసుకొస్తారని మొదటి నుంచే అంచనాలు ఉన్నాయి. ఓ సందర్భంగా గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక పథకం తీసుకొస్తున్నలు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సమితా దావ్రా చెప్పారు. ఇప్పుడు గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్లు సంప్రదాయ ఉద్యోగుల కాదని కార్మిక శాఖ కార్యదర్శి దావ్రా తెలిపారు. వారికి ఎలాంటి సామాజిక భద్రతా పథకాలు, ప్రయోజనాలు లేవని, అందుకోసం వారికి కేంద్రం ప్రత్యేక పథకం తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలోని ఇ-కామర్స్, సేవా రంగాలకు మరింత ఊతమిచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ రంగాల్లో పని చేసే సిబ్బందికి సామాజిక భద్రత కల్పించడం ద్వారా ఎక్కువ మంది వర్కర్లు సేవలందించేందుకు ముందు కొస్తారని కేంద్రం భావిస్తున్నట్లు చెప్పారు.

# ఈ ఎన్నికల్లో మేం ఓడిపోతే జరిగేది అదే..

**ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ అద్మీ పార్టీ ఓడిపోతే.. ఉచిత కరెంట్, నీరు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అన్నీ ఆగిపోతాయని స్పష్టం చేశారు. బీజేపీ వీటన్నిటినీ ఆపేస్తుందన్నారు. అలాగే ఢిల్లీ ప్రజలు అందరికీ నెలకు రూ.25 వేల ఖర్చు పెరిగిపోతుందన్నారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సర్కారు బడులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. అలాగే ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తుందో లేదో కూడా తనకంటే జనాలకే బాగా తెలుసని చెప్పారు.**

మరికొద్ది రోజుల్లోనే దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతుండగా.. ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ షాకింగ్ వీడియో విడుదల చేశారు. అందులో తమ పార్టీ ఈ ఎన్నికల్లో ఓడిపోతే జరగబోయే వాటి గురించి వివరించారు. ముఖ్యంగా ఆప్ ఓడిపోతే.. ఢిల్లీలో ఉచిత కరెంటు, నీళ్లు, మెరుగైన విద్య, నాణ్యమైన ఆరోగ్య చికిత్సలు అందవని అన్నారు. అంతేకాకుండా ఇక్కడి ప్రజలు అందరికీ నెలకు పాతిక వేల ఖర్చు పెరిగిపోతుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో మరో నాలుగు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈక్రమంలోనే ప్రధాన పార్టీలన్నీ పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు అయితే.. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక వరాల జల్లులు కురిపిస్తున్నాయి. అలాగే ఇతర పార్టీలపై తీవ్ర విమర్శలు చేస్తూ వారికి జనాలు ఓట్లు వేయకుండా చేసేందుకు కృషి చేస్తున్నాయి. తాజాగా ఇలాంటి ప్రయత్నమే చేశారు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్. తమ పార్టీ ఈ ఎన్నికల్లో ఓడిపోతే జరగబోయేది అదేనంటూ ఓ వీడియో విడుదల చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

మరో నాలుగు రోజుల్లో జరగబోతున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ సర్కారు ఓడిపోతే.. జరగబోయేది ఇదేనంటూ కేజ్రీవాల్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో బీజేపీ మద్దతుదారులను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ మద్దతుదారులతో ముఖ్యమైన విషయాలు



మాట్లాడాలనుకుంటున్నాని చెప్పుకొచ్చారు. ఇటీవలే ఆ పార్టీకి చెందిన ఓ అభిమానిని కలిశాని.. అప్పుడు ఆయన ఈ ఎన్నికల్లో మీరు ఓడిపోతే ఎలా అని ప్రశ్నించినట్లు తెలిపారు. దానికి అతడు కచ్చితంగా సమాధానం తెలుసుకోవాలని కేజ్రీవాల్ వెల్లడించారు.

ఈక్రమంలోనే వీడియోలో ఆ సమాధానం వివరించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ అద్మీ పార్టీ ఓడిపోతే.. ఉచిత కరెంట్, నీరు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అన్నీ ఆగిపోతాయని స్పష్టం చేశారు. బీజేపీ వీటన్నిటినీ ఆపేస్తుందన్నారు. అలాగే ఢిల్లీ ప్రజలు అందరికీ నెలకు రూ.25 వేల ఖర్చు పెరిగిపోతుందన్నారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సర్కారు బడులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. అలాగే ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తుందో లేదో కూడా తనకంటే జనాలకే బాగా తెలుసని చెప్పారు. బీజేపీ ప్రయోజనాల గురించి కాకుండా.. బీజేపీ మద్దతుదారులు తమ కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు. వారంతా ఆ పార్టీని వీడినా, వీడికపోయినా ఓట్లు మాత్రమే ఆమ్ ఆద్మీ పార్టీకి వేసి గెలిపిస్తే ఢిల్లీ అభివృద్ధికి సాయం చేసిన వారు అవుతారన్నారు. ఇదంతా ఇలా ఉండగా.. ఢిల్లీలో ఫిబ్రవరి 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం 70 స్థానాలు ఉన్న ఈ అసెంబ్లీ ఎన్నికల్లో.. ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఎన్ని స్థానాలు దక్కించుకుంటుందో చూడాలి మరి.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్.. 8 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఉదయం నుంచి భీకర కాల్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు 8 మంది నక్సల్స్ మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. హామీ ఇచ్చినప్పటి నుంచి.. నక్సల్స్‌కు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. నక్సల్స్ ఏరివేతలో భాగంగా కూంబింగ్ ఆపరేషన్లు చేస్తున్న పోలీసులు, భద్రతా బలగాలు.. మావోయిస్టులకు ఎప్పటికప్పుడు షాక్ ఇస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తరచూ సెక్యూరిటీ ఫోర్స్, నక్సల్స్‌కు మధ్య జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లలో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు.

ఈ నేపథ్యంలోనే తాజాగా మరోసారి నక్సల్స్, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లాల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లాయి. ఈ క్రమంలోనే అడవుల్లో నక్కి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు జరిపినట్లు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు.

ఈ నేపథ్యంలోనే ఎదురుకాల్పులు చోటు చేసుకోగా.. ఆ కాల్పుల్లో 8 మంది నక్సల్స్ చనిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా మావోయిస్టులు ఉన్నారా అనే కోణంలో భద్రతా బలగాలు, పోలీసులు భారీ సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.



# భూభ్రమణం చూశారా?

భూమి తనచుట్టూ తిరగడాన్ని భూభ్రమణం.. సూర్యుడి చుట్టూ తిరగడాన్ని భూపరిభ్రమణం అంటాం. అయితే, వీటిని మనం నేరుగా చూడలేం. దీని ఆధారంగానే రోజు, నెల, సంవత్సరం అనేది నిర్ణయించారు. కానీ, భూమి అక్షం ఓవైపునకు వంగి ఉండి.. సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. దీనిని భారతీయ శాస్త్రవేత్త అద్భుత దృశ్యాలను వీడియో తీశారు. ఇందుకు ఆయన చాలా సవాళ్లను ఎదుర్కొన్నారు. లడఖ్‌లో భూమి తిరుగుతున్న వీడియోను టైమ్‌లాప్స్‌లో ఆయన బంధించడం గమనార్హం..

భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగుతుందని తెలుసు. దీనినే భూభ్రమణం.. భూపరిభ్రమణం అంటారు. అయితే, ఇవి మన కంటికి కనిపించవు. కానీ, భారతీయ ఖగోళ శాస్త్రవేత్త డోర్జే అంగ్‌చుక్ (%ఇశీతీయవ-ాఅస్త్రఎష్ట్రబన%) భూభ్రమణానికి సంబంధించిన అద్భుత దృశ్యాలను వీడియో తీశారు. లడఖ్‌లో భూమి భ్రమిస్తున్న వీడియోను టైమ్‌లాప్స్‌లో ఆయన బంధించారు. హాన్లేలోని ఇండియన్ ఆస్ట్రోనామికల్ అబ్జర్వేటరీ (ఐఐఏ) ఇంజినీర్-ఇన్‌ఛార్జిగా అంగ్‌చుక్ పనిచేస్తున్నారు. 24 గంటల పాటు టైమ్‌లాప్స్‌ను ఉపయోగించి ఆయన ఈ వీడియో తీశారు.

ఈ మొత్తాన్ని ఒక నిమిషం వీడియోగా మార్చి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. ఈ వీడియోలో భూమి ఏలా తిరుగుతుందో స్పష్టంగా కనిపిస్తోంది. అంగ్‌చుక్ మాట్లాడుతూ.. నక్షత్రాలు నిశ్చలంగా ఉంటే, భూమి పరిభ్రమిస్తూ ఉంటుందని తెలిపారు. వీడియోలో బంధించడానికి చాలా ఇబ్బందులు పడినట్లు పేర్కొన్నారు. ఇది నా ఓర్పు, సహనాన్ని పరీక్షించిందని చెప్పారు. "మొదట్లో ఓరియన్‌ను ఫ్రేమ్‌లో బంధించాలని భావించాను... కానీ అది ఆకాశంలో 4 అక్షాంశాల ఎత్తులో ఉంది... విపరీతమైన చలి మరింత కఠినతరం చేసింది.. బ్యాటరీ ఛార్జింగ్ వేగంగా తగ్గిపోయింది..." అని తెలిపారు. 'కెమెరా స్టోరేజ్, బ్యాటరీ వైఫల్యం, టైమర్ పనిచేయకపోవడం వంటి అనేక సవాళ్లతో నాలుగు రాత్రుల పాటు కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నాను.. ప్రతి సందర్భంలోనూ అవాంతరం ఏర్పడింది.. ఒకదశలో విరమించుకోవాలని నిర్ణయానికి వచ్చాను కూడా.. భ్రమణం, మొబైల్ సెటప్‌ను మార్గనిర్దేశం చేసే ట్రాకర్‌తో ప్రతికూలతను అధిగమించి చివరకు సజావుగా సంగ్రహించాను... అయినప్పటికీ, పోస్ట్‌ప్రాసెసింగ్ సవాళ్ల తప్పలేదు.. ఫ్రేమింగ్‌లో వ్యత్యాసం కారణంగా క్రాప్ చేయాల్సి వచ్చింది.. చివరికి ఆ ప్రయత్నం విలువైంది' అని చెప్పారు.

భూ భ్రమణం గురించి విద్యార్థులు సులువుగా అవగాహన చేసుకునేలా వీడియో రూపొందించాలని వచ్చిన అభ్యర్థన మేరకు ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు అంగ్‌చుక్ పేర్కొన్నారు. లడఖ్‌లోని విపరీతమైన శీతల వాతావరణం వల్ల వీడియో చిత్రీకరిస్తున్న నాలుగు రాత్రుల్లో పలుమార్లు బ్యాటరీ వైఫల్యాలు, టైమర్ పని చేయకపోవడం వంటివి ఎదుర్కొన్నా.... కానీ ఎలాగైనా వీడియో రూపొందించాలనే ఆలోచనతో ముందుకు వెళ్లానని ఆయన అన్నారు. లడఖ్‌లో అతి శీతల వాతావరణం వల్ల కెమెరాలు, బ్యాటరీలు కూడా పనిచేయడానికి మొరాయించాయని అంగ్‌చుక్ తెలిపారు. కానీ, ఈ సవాల్‌ను అధిగమించాలని నిర్ణయించుకుని పట్టుదలతో వెళ్లడంతో సాధ్యమైందని ఆయన వివరించారు. ఇక, సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేయడంతో ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. వీడియోను చూసిన నెటిజన్లు ఆయన పనికి ఫిదా అవుతున్నారు.

**మొబైల్ సెటప్‌ను మార్గనిర్దేశం చేసే ట్రాకర్‌తో ప్రతికూలతను అధిగమించి చివరకు సజావుగా సంగ్రహించాను... అయినప్పటికీ, పోస్ట్‌ప్రాసెసింగ్ సవాళ్ల తప్పలేదు.. ఫ్రేమింగ్‌లో వ్యత్యాసం కారణంగా క్రాప్ చేయాల్సి వచ్చింది.. చివరికి ఆ ప్రయత్నం విలువైంది' అని చెప్పారు.**

# వీధికుక్కపై యువకుడి అత్యాచారం..

కామవాంఛ ఎక్కువై పలువురు పురుషులు అనేక దారుణాలకు ఒడిగడుతున్నారు. కళ్లకు ఏం కనిపించినా దానిపై పడుతూ పడక సుఖాన్ని పొందుతున్నారు. తాజాగా ఓ యువకుడుకి శృంగార కోరికలు ఎక్కువ కాగా.. దొరికిన వీధి కుక్కపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి రైల్వే స్టేషన్‌లో శునకాన్ని పట్టుకుని సుఖం పొందాడు. ఇంతలోనే ఓ వ్యక్తి అటుగా వెళ్లగా ఈ దారుణం బయట పడింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఉన్న బోరివాలి రైల్వే స్టేషన్‌లో దారుణం జరిగింది. జనవరి 29వ తేదీ వేకువజామున 2 గంటలకు ఓ యువకుడికి శృంగార కోరికలు ఎక్కువ కాగా.. వాటిని తీర్చుకోవడానికి చాలానే ప్రయత్నాలు చేశాడు. కానీ కామ వాంఛను ఆపుకోలేక.. చివరకు 3 గంటలకు ఓ వీధి కుక్కపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరూ లేని ఫూటోవర్ బ్రిడ్జిపై కుక్కను పట్టుకుని రేప్ చేశాడు. ఈ రాక్షస క్రీడ జరుపుతుండగా... వీధి శునకం విపరీతమైన కేకలు పెట్టింది. ఆ శబ్దాలు విన్న ఓ వ్యక్తి.. అటుగా వెళ్లాడు. విషయం గుర్తించి వెంటనే ఫోన్ తీసి వీడియో తీయడం ప్రారంభించాడు. అలా దగ్గరకు వెళ్తూ ఏం చేస్తున్నావని ప్రశ్నించగానే.. వెంటనే పైకి లేచి ప్యాంటు వేసుకున్నాడు. ఏమీ లేదంటూనే నడుస్తూ వెళ్లిపోయాడు. మరోవైపు కుక్క అక్కడి నుంచి తప్పించుకుపోయింది. ఈ వీడియో తీసిన వ్యక్తి దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రైల్వే స్టేషన్ సమీపంలోనే ఇంత దారుణం జరిగిందని వివరించాడు. ఈ వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు అప్పగించమంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. చివరకు జంతువులను కూడా వదల్లేకపోతున్న ఇలాంటి పశువులకు కఠిన శిక్షపడేలా చేయాలంటూన్నారు. ఆడ పిల్లలను కాపాడుకోవడమే కష్టంగా మారిందంటే.. జంతువులకూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి తీసుకువస్తున్నారంటూ మరికొంత మంది తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు.

ఉదయం



# రణబీర్, జాన్వీ బెస్ట్ ఛాయిస్..






సినీ తారలు వ్యాపార ప్రకటనల్లోనూ నటిస్తూ రెండు చేతులా సంపాదిస్తుంటారు. అయితే కొందరు హీరో హీరోయిన్లు మాత్రం బ్రాండ్ ఎండార్స్మెంట్స్ చేయడానికి కొన్ని షరతులు పెట్టుకుంటారు. డబ్బుల కోసం ఏది పడితే అది ప్రమోట్ చేయడానికి ఇష్టపడరు. మద్యం, పొగాకు ఉత్పత్తులకు ప్రచారం చేయరు. అలానే మరికొందరు సెలబ్రిటీలు కండోమ్స్ ప్రకటనల్లో నటించడానికి వెనకడుగు వేస్తుంటారు. కాకపోతే సేఫ్టీ గురించి జనాలకు తెలియజేయడంలో తప్పు లేదని భావించే స్టార్స్ కూడా ఉన్నారు. అయితే రణబీర్ కపూర్, జాన్వీ కపూర్ కండోమ్ యాడ్‌కు బెస్ట్ ఛాయిస్ అని ఓ ప్రముఖ వ్యాపారవేత్త అంటున్నారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో అనేకమంది హీరో హీరోయిన్లు ఓవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు బ్రాండ్ ఎండార్స్మెంట్స్ ద్వారా సంపాదిస్తుంటారు. తమ క్రేజ్, స్టార్ డమ్ ను క్యాష్ చేసుకుంటూ వివిధ బ్రాండ్స్ కు అంబాసిడర్లుగా వ్యవహరిస్తుంటారు. ఇందుకుగాను భారీగానే రెమ్యునరేషన్ తీసుకుంటారు. ఈ క్రమంలో కొందరు సెలబ్రిటీలు కండోమ్ కంపెనీలకు కూడా ప్రచారకర్తలుగా ఉన్నారు. కార్తీక్ ఆర్యన్ దగ్గర నుంచి సన్నీ లియోన్ వరకూ పలువురు సినీ తారలు కండోమ్ బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నారు. అయితే కండోమ్‌లను ప్రమోట్ చేయడానికి బాలీవుడ్ స్టార్స్ రణబీర్ కపూర్, జాన్వీ కపూర్ బెస్ట్ ఛాయిస్ అంటూ ఓ ప్రముఖ వ్యాపారవేత్త చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

మ్యాన్‌కైండ్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ జునేజా రీసెంట్ గా ఓ పాడ్ కాస్ట్ లో.. ఒక బ్రాండ్ కు సరైన ప్రచారకర్తను ఎంపిక చేయడం ఎంత అవసరం అనే దానిపై మాట్లాడారు. ఈ సందర్భంగా మ్యాన్‌ఫోర్స్ కండోమ్స్ కు ప్రచారం చేయడానికి మేల్ యాక్టర్స్ లో రణబీర్ కపూర్, ఫీమేల్ యాక్టర్స్ లో జాన్వీ కపూర్ బెస్ట్ ఛాయిస్ అని ఆయన అభిప్రాయపడ్డారు. తమ కంపెనీ ఉత్పత్తులు ఆరోగ్యకరమైన శృంగారం గురించి అవగాహన కల్పించాలని కోరుకుంటున్నాయని.. రణబీర్, జాన్వీ, కార్తీక్ ఆర్యన్ లాంటి పాపులర్ సెలబ్రిటీలైతే పాజిటివ్ గా జనాలతో కనెక్ట్ అవడానికి అవకాశం కలుగుతుందని రాజీవ్ తెలిపారు.

మ్యాన్‌ఫోర్స్ కోసం ఇప్పటికే రణబీర్ కపూర్, జాన్వీ కపూర్ లను కూడా సంప్రదించామని, కానీ కండోమ్స్ ను ప్రమోట్ చేయడానికి వారిద్దరూ అంగీకరించలేదనే విషయాన్ని జునేజా వెల్లడించారు. గతంలో మ్యాన్‌ఫోర్స్ కండోమ్స్ కు శృంగార తార సన్నీ లియోన్ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించారు. 'బిగ్ బాస్'తో సన్నీకి ఫుల్ పాపులారిటీ రావడంతో తమ ప్రోడక్ట్స్ ని ప్రమోట్ చేయడానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే 2023 నుంచి ఆమె స్థానంలోకి కార్తీక్ ఆర్యన్ ను తీసుకొచ్చారు. కండోమ్ లకు ప్రచారకర్తగా వ్యవహరించడంపై కార్తీక్ ఆర్యన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సేఫ్టీ, పాన్ మసాలాలలో ఏది ఎన్నుకోవాలనే ప్రశ్న వచ్చినప్పుడు సేఫ్టీ ముఖ్యం కాబట్టి నేను దాన్నే ఎంపిక చేసుకున్నానని తెలిపారు.

# ఆ హీరోల సరసన చేరుతాడా?



టాలీవుడ్ హీరోలంతా ఇప్పుడు పాన్ ఇండియా ఇమేజ్ కోసం ట్రై చేస్తున్నారు. స్టార్ హీరోల దగ్గర నుంచి యువ కథానాయకుల వరకూ అందరూ బాలీవుడ్ లో సత్తా చాటాలని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభాస్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి తెలుగు స్టార్స్ హిందీలో తమకంటూ సొంతంగా మార్కెట్ క్రియేట్ చేసుకున్నారు. విజయ్ దేవరకొండ, నాని, రామ్ పోతినేని, నిఖిల్ సిద్దార్థ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ లాంటి టైర్-2 హీరోలు కూడా ఇప్పుడు తమ సినిమాలను ఇతర భాషల్లోనూ విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు అక్కినేని నాగచైతన్య కూడా 'తండేల్' మూవీతో పాన్ ఇండియా మీద దృష్టి సారిస్తున్నారు.

నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'తండేల్'. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఫిబ్రవరి 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటుగా తమిళ, హిందీ భాషల్లోనూ విడుదల చేస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే చెన్నై, ముంబై నగరాల్లోనూ ప్రమోషనల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. నార్త్ ప్రమోషన్స్ లో భాగంగా శుక్రవారం చిత్ర బృందం ముంబయిలో హిందీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతో ఇప్పుడు బాలీవుడ్ సర్కిల్స్ లోనూ చైతూ సినిమా గురించి చర్చలు జరుగుతున్నాయి.

నిజానికి రెండున్నరేళ్ల క్రితమే హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు నాగ చైతన్య. అమీర్ ఖాన్ హీరోగా నటించిన 'లాల్ సింగ్ చద్దా' సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఆమీర్ స్నేహితుడిగా ఆయన పోషించిన బాలరాజు పాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చింది. కానీ మూవీ ఫ్లాప్ అవ్వడంతో చైతూ గురించి బాలీవుడ్ లో పెద్దగా డిస్కషన్ జరగలేదు. అయితే అమెజాన్ ప్రైమ్ వేదికగా వచ్చిన 'దూత' వెబ్ సిరీస్ అతనికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'తండేల్' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోడానికి రెడీ అయ్యారు. హిందీ డెబ్యూ నిరాశ పరిచినా, ఈసారి తప్పకుండా సక్సెస్ దక్కుతుందని నమ్మకంగా ఉన్నారు.

'తండేల్' మూవీలో నాగచైతన్యకు జోడీగా సాయి పల్లవి నటిస్తోంది. 'లవ్ స్టోరీ' తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో రూపొందిన చిత్రమిది. ఇటీవల 'అమరన్'తో హిట్టు కొట్టిన సాయి పల్లవి.. ప్రస్తుతం హిందీలో రామాయణం సినిమా చేస్తోంది. 'ఏక్ దిన్' అనే మరో చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పుడు చైతూ సినిమాకి ఆమె క్రేజ్ ప్లస్ అవుతుంది. మరోవైపు డైరెక్టర్ చందూ మొండేటికి బాలీవుడ్ లో గుర్తింపు ఉంది. ఆయన చివరి సినిమా 'కార్తికేయ 2' హిందీ ఆడియన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంది. కొందరు బిగ్ స్టార్స్ కూడా అతనితో వర్క్ చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. సో ఆ అంశాలన్నీ ఇప్పుడు తండేల్ సినిమాకి కలిసొచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైతే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. మరి ఈ చిత్రం చైతన్యకు ఎలాంటి పాన్ ఇండియా విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ వింత కోరిక..





పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తాజాగా హరీష్ శంకర్‌కు ఓ రిక్వెస్ట్‌ను పంపారు. ఎప్పుడూ ఈ పొలిటికల్ క్యాస్టూమ్‌లో చూసి బోర్ కొడుతోందని, కాస్త కలర్ ఫుడ్ క్యాస్టూమ్‌లో చూపించి అంటూ హరీష్ శంకర్‌కు ట్యాగ్ చేశారు. గబ్బర్ సింగ్ స్టైల్లో చాలా కొత్తగా కలర్ ఫుల్‌గా చూపించు అని అడిగేశారు. ఇక దీనికి హరీష్ శంకర్ సైతం స్పందించాడు. హహహ అంటూ నవ్వుతూ సరే అని అనేశాడు.

పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలతోనే బిజీగా ఉన్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తన పనుల్లో తల మునకలై ఉంటున్నారు. ఇలాంటి బిజీ టైంలోనూ పవన్ కళ్యాణ్ కాస్త వీలు చూసుకుని డేట్లు ఇస్తున్నాడు. అసలు తాను ఇచ్చిన డేట్లను మేకర్లు సరిగ్గా వాడుకోలేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పవన్ కళ్యాణ్ చెప్పిన సంగతి తెలిసిందే. మరీ ముఖ్యంగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విషయంలో అయితే పలు మార్లు మార్పులు చేర్పులు జరిగాయన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ కూడా చెప్పేశాడు.

హరీష్ శంకర్ సొంతంగా ఓ కథను రాసుకున్నాడు. ఆ కథతోనే పవన్ కళ్యాణ్ మూవీని మైత్రీ సంస్థ నిర్మించాల్సి ఉంది. ఆ తరువాత కథ సరిగ్గా రెడీ అవ్వకపోవడంతో వెంటనే ఉన్న డేట్లను వేస్ట్ చేయొద్దని తేరి రీమేక్‌ను స్టార్ట్ చేశారు. అయితే ఇవన్నీ స్టార్ట్ అయ్యే లోపు ఎన్నికలు, ప్రచారం, గెలవడం, డిప్యూటీ సీఎంగా ఎదగడం అన్నీ జరిగిపోయాయి. దీంతో సినిమాలన్నీ పక్కకు వెళ్లిపోయాయి. ఇప్పుడు పవన్ కళ్యాణ్ డేట్లు దొరకడం గగనంగా మారిపోయింది.

ఈ క్రమంలో రీసెంట్‌గానే హరి హర వీరమల్లు సినిమాకు డేట్లు ఇచ్చాడు. మార్చిలో ఈ చిత్రం రిలీజ్‌కు రెడీగా ఉంది. అందుకే ముందుగా ఈ మూవీకి డేట్లు ఇచ్చాడు. ఆ తరువాత ఓజీ చిత్రానికి డేట్లు సమకూర్చేలా ఉన్నాడు. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ మీద అందరికీ చాలా అనుమానాలున్నాయి. అసలు ఈ మూవీ ఉంటుందా? ఉంటే తేరీ రీమేక్ కథనే తీస్తారా? కథను మార్చుకుంటారా? అసలే రీమేక్‌లు బెడిసి కొడుతున్న ఈ తరుణంలో మళ్లీ అలాంటి రీమేక్‌ను ఆదరిస్తారా? అన్నది చూడాలి. ఇక తాజాగా పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ హరీష్ శంకర్‌కు వింత రిక్వెస్ట్ పంపారు. పవన్ కళ్యాణ్‌ను ఎప్పుడూ ఆ జుబ్బాలో ఒకే క్యాస్టూమ్‌లో చూసి బోర్ కొడుతోంది.. నువ్వు అయినా చాలా స్టైలీష్‌గా, కొత్తగా చూపించు అన్నా అంటూ హరీష్ శంకర్‌కు ఓ ఫ్యాన్ రిక్వెస్ట్ పెట్టాడు. దానికి హరీష్ శంకర్ రిప్లై ఇస్తూ నవ్వేస్తాడు. సరే గుర్తు పెట్టుకుంటా అంటూ హహహ అనే నవ్వేశాడు.

# ఇలా బర్త్‌డే విషెస్ చెప్తారా

కమెడియన్లు ఎంతోమంది వస్తుంటారు.. పోతుంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా చిరంజీవిగా నిలిచిపోతారు. అలాంటి గొప్ప కమెడియన్లలో బ్రహ్మానందం ఒకరు. గత 40 ఏళ్లుగా ఆయన తన హాస్యంతో ఎంతోమందిని నవ్వించారు.. తన నటనతో కొన్నిసార్లు ఏడిపించారు.. ఇప్పటికీ దిగ్విజయంగా సినిమాలు చేస్తూ కొనసాగుతున్నారు. అలాంటి బ్రహ్మానందం ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్నారు. 69వ పడిలోకి అడుగుపెట్టిన బ్రహ్మీకి బర్త్‌డే విషెస్ వెల్లువగా వస్తున్నాయి. సెలబ్రెటీల విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో బ్రహ్మానందానికి వస్తున్న విషెస్ మాములుగా లేవు. ముఖ్యంగా ప్రతి రోజూ బ్రహ్మానందం ఫొటో లేకుండా మీమ్స్ క్రియేట్ చేయడం దాదాపు అసాధ్యమే. ఎందుకంటే ఆయన ఎక్స్‌ప్రెషన్స్, సినిమాల్లో చేసిన కామెడీ నుంచే మీమ్స్ క్రియేట్ చేసి ట్రోలర్స్ వీడియోలు చేస్తుంటారు. అందుకే తమ 'గాడ్ ఆఫ్ మీమ్స్' అంటూ బ్రహ్మీకి స్పెషల్ విషెస్ తెలియజేస్తున్నారు.

తాజాగా ఓ మీమర్ క్రియేట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆర్ఆర్ఆర్ సినిమాలో రామ్ చరణ్ ఎంట్రీ సీన్‌ని తీసుకొని దాంట్లో బ్రహ్మానందాన్ని యాడ్ చేసి ఈ వీడియో ఎడిట్ చేశారు. బాద్‌షా సినిమాలో బ్రహ్మానందం కనిపించిన పోలీస్ పాత్రలో సీన్స్ ఇందులో యాడ్ చేసి నవ్వులు పూయించారు. ఈ వీడియో చూసి నెటిజన్లు బ్రహ్మీకి బర్త్‌డే విషెస్ చెబుతున్నారు.



అలానే బ్రహ్మానందం గురించి చిరంజీవి గతంలో మాట్లాడిన మాటలతో కూడా వీడియోలు వైరల్ అవుతున్నాయి. జన్మ జన్మలకి దోమగా పుడితే 10 దోమలని, కుక్కగా పుడితే పది కుక్కలని, ఇంకొక జంతువుగా పుడితే 10 జంతువులని నవ్వించే శక్తి భగవంతుడు నాకు ప్రసాదించాలని ఎప్పుడూ కోరుకుంటా అంటూ బ్రహ్మానందం గతంలో మాట్లాడిన వీడియోలు కూడా మీమ్స్ పేజీల్లో దర్శనమిస్తున్నాయి.

ఇన్నేళ్ల తన కెరీర్‌లో బ్రహ్మానందం ఎన్నో అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించారు. అయితే ఇటీవలి కాలంలో రెగ్యులర్ కమెడియన్ పాత్రలను బ్రహ్మీ తిరస్కరిస్తున్నారు. నటనకి స్కోప్ ఉన్న సీరియల్ పాత్రల వైపు మళ్లారు. అందులో భాగంగా చేసిన రంగమార్తాండ చిత్రంలో బ్రహ్మానందం నటన చూసి ఎంతోమంది ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ నవ్వించే బ్రహ్మీ ఈ సినిమాలో తన నటనతో అందరినీ ఏడిపించేశారు. తాజాగా 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం ద్వారా ఆడియన్స్‌ని పలకరించబోతున్నారు. ఇందులో తన కుమారుడు రాజా గౌతమ్‌కి తాతయ్యగా నటించారు బ్రహ్మీ.

# మూడో పెళ్లికి సిద్ధమైన హీరో..?



బాలీవుడ్ స్టార్ నటుడు ఆమీర్ ఖాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న లీడింగ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు. ఆయన్ని ముద్దుగా మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అని కూడా పిలుస్తుంటారు. లగాన్, గజినీ, పీకే, దంగల్‌తోపాటు ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించి సక్సెస్ రేంజ్‌లో ఉన్న ఈ స్టార్ పర్సనల్ లైఫ్‌లో మాత్రం అంత హ్యాపీగా లేడనే చెప్పాలి. ఇప్పటికే ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమీర్ వయసు 59 ఏళ్లు. ఈ క్రమంలోనే ఆమీర్ ముచ్చటగా మూడో పెళ్లిక సిద్ధమైనట్లు తెలిసింది. బెంగళూరుకు చెందిన ఓ మహిళతో ఆమీర్ ఖాన్ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నట్లు సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. ఆమెను ఇటీవలే తన కుటుంబ సభ్యులకు కూడా పరిచయం చేసినట్లు టాక్. వీరి పెళ్లికి కుటుంబ సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అన్నీ కుదిరితే అతి త్వరలోనే ఆమీర్ మూడోసారి పెళ్లి పీటలు ఎక్కనున్నట్లు నటుడి దగ్గరి వ్యక్తి ఒకరు చెప్పినట్లు జాతీయ మీడియాలో కూడా వరుస కథనాలు వస్తున్నాయి. 'ఆమీర్ బెంగళూరుకు చెందిన ఓ మహిళతో డేటింగ్‌లో ఉన్నారు. వారి గోప్యతను గౌరవించి వ్యక్తిగత వివరాలు వెల్లడించలేను. ఆమెను ఆమీర్ తన కుటుంబ సభ్యులందరికీ పరిచయం చేశాడు. ఆ మీటింగ్ చాలా బాగా జరిగింది' అంటూ సరదు వ్యక్తి చెప్పినట్లు మీడియా పేర్కొంది.

# అది గిట్టనివాళ్ల పనే..



అల్లు అర్జున్ సంధ్య థియేటర్ ఘటనపై లేటుగా రియాక్ట్ అయిన అనసూయ లేటెస్ట్ కామెంట్స్‌తో హాట్ టాపిక్ అవుతున్నారు. అల్లు అర్జున్ నటించిన పుష్ప పార్ట్ 1, పార్ట్ 2 చిత్రాల్లో నటించిన అనసూయ.. ఆ సినిమాలో తన రోల్‌కి పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంపై కూడా స్పందించారు. తాజా ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడుతూ.. 'పుష్ప పార్ట్ 1 రిలీజ్ అయినప్పుడు కూడా ఇదే మాట్లాడారు. నా రోల్ తక్కువ ఉంది.. ఇంకా ఎక్కువ ఉంటే బాగుండని. కానీ ఇప్పుడు పార్ట్ 2 వచ్చినప్పుడే దీనికంటే నీ రోల్ అందులోనే బాగుందని అంటున్నారు. దీని గురించి నేను ట్వీట్ కూడా చేశాను. పుష్ప అనేది కంటిన్యూ స్టోరీ. మూడు పార్ట్‌లు ఉంటుంది. నా రోల్ తక్కువగా ఉందని అంటున్నారంటే.. దాన్ని నేను కాంప్లిమెంట్‌లాగే తీసుకుంటాను.

ఎందుకంటే.. నన్ను ఎక్కువగా చూడాలని అనుకున్నారు కాబట్టి.. ఎంత చూసినా చూసినట్లు అనిపించడం లేదేమో అనుకుని హ్యాపీగానే ఫీల్ అయ్యా. కానీ ఒక సినిమా అనేది డైరెక్టర్ డ్రీమ్. పాపం పుష్ప సార్.. నన్ను ఆడిషన్స్‌కి పిలిచినప్పుడు నువ్వు ఎక్కువ ఎక్స్‌పెక్ట్ చేయకు.. రంగమ్మత్తలా ఉండదని ముందే చెప్పారు. మంగళం శీను అనే సునీల్ గారి వైఫ్ పాత్రకి ఒక క్యారెక్టర్ కావాలి. దానికి ఎవర్ని పడితే వాళ్లని పెట్టలేం కాబట్టి.. వెయిట్ ఉన్న నీలాంటి పర్సన్ కావాలి అని అన్నారు.

నాకు సుక్కూ సార్ అంటే గురు. ఆయన పట్ల నాకు ఎప్పుడూ కృతజ్ఞత ఉంటుంది. ఆయన పిలిచారంటే వెళ్లిపోతానంతే గుడ్డిగా. నా డ్రీమ్ ఏంటంటే.. అనసూయ ఏ పాత్ర అయినా బాగా చేయగలదు అని ప్రతి డైరెక్టర్ అనుకోవాలి. స్క్రీన్ స్పేస్ తగ్గిందంటే అది నా చేతుల్లో లేదు. అందరికీ ఇదొక గుణపాఠం. బన్నీ గారు దీని నుంచి చాలా నేర్చుకున్నారు. నెక్స్ట్ టైం ఎలా ఉండాలో తెలిసింది. ఆయన కావాలని అయితే చేయలేదు. అలాగని వాళ్లు కూడా కావాలని పడిపోయింది లేదు. రద్దీగా ఉండే ప్రదేశాలలోకి పిల్లలతో వెళ్లకూడదని చాలామందికి తెలిసింది. మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఇది అందరికీ పెద్ద గుణపాఠం.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,